RNI No. APTEL/2009/28868

# సిటిజన్ టైమ్స్

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

తెలుగు దినపత్రిక

CITIZEN TIMES TELUGU DAILY



VOLUME: 17 | ISSUE: 279 | EDITOR: KANCHERLA SANDEEP KUMAR | VISAKHAPATNAM 06-5-2026 | Pages: 8 | Rs: 2/-
సంపుటి : 17 | సంచిక : 279 | ఎడిటర్ : కంచర్ల సందీప్ కుమార్ | విశాఖపట్నం 06-5-2026 | పేజీలు : 8 | రూ: 2/-

# వి.ఎం.ఆర్.డి.ఏలో ‘సిండికేట్ రాజ్యం’

## అభివృద్ధి నిధులపై దోపిడీ దండయాత్ర!

- అభివృద్ధి సంస్థలో అవినీతి ఆరోపణల వెల్లువ
- టెండర్ వ్యవస్థపై ‘సిండికేట్’ ప్రభావం?
- టెక్నాలజీ పేరిట కోట్ల ఖర్చులు
- లెక్కలు సరిపోతున్నాయా?
- నిజాయితీ అధికారులకు ఇబ్బందులు
- పరిపాలనలో ఒత్తిళ్లు
- ప్రజాధనంపై ముప్పు
- విచారణ అవసరమని ప్రజల డిమాండ్

*అభివృద్ధి కోసం కేటాయించిన ప్రజాధనం దారి తప్పుతోందా? వి.ఎం.ఆర్.డి.ఏలో కొందరు అధికారుల చుట్టూ ఏర్పడిన ‘సిండికేట్’ ప్రభావంతో టెండర్లు, కొనుగోళ్లు, ప్రాజెక్ట్ ఖర్చులన్నీ అనుమానాస్పదంగా మారినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కోట్ల రూపాయల లావాదేవీలపై ప్రశ్నలు తలెత్తుతుండగా, పారదర్శకతకు నిలువెత్తు నిదర్శనంగా ఉన్న సంస్థ ఇప్పుడు విమర్శల కేంద్రంగా మారడం ఆందోళన కలిగిస్తోంది.*







**సిటిజన్ టైమ్స్ ప్రత్యేక కథనం**
**విశాఖపట్నం, మే 06**

విశాఖపట్నం మెట్రో రీజియన్ అభివృద్ధి సంస్థ (వి ఎం ఆర్ డి ఏ) ఒకప్పుడు పారదర్శక పాలనకు ప్రతీకగా నిలిచింది. అయితే ఇటీవల వెలుగులోకి వస్తున్న పరిణామాలు ఆ ప్రతిష్ఠను ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయి. మూడు జిల్లాల సమగ్ర అభివృద్ధి కోసం వినియోగించాల్సిన ప్రజా నిధులు, కొంతమంది అధికారుల చేతుల్లో దుర్వినియోగానికి గురవుతున్నాయనే ఆరోపణలు తీవ్ర చర్చకు దారి తీస్తున్నాయి.

**‘సిండికేట్’ ఆరోపణలు – వ్యవస్థపై పట్టు?**

సంస్థలో కొందరు కీలక ఇంజనీర్లు కలిసి పనిచేస్తూ టెండర్ విధానాలపై ప్రభావం చూపుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పనుల ఎంపికలో పారదర్శకత లోపించడం టెండర్ ప్రక్రియలో పోటీదారులను సాంకేతిక కారణాలతో తప్పించడం ఎంపిక చేసిన సంస్థలకు అధిక అంచనాలు మంజూరు చేయడం ఇలాంటి చర్యల ద్వారా కోట్ల రూపాయల లావాదేవీలు అనుమానాస్పదంగా మారుతున్నాయని వర్గాలు చెబుతున్నాయి. టెక్నాలజీ పేరుతో అధిక వ్యయాలు సంస్థలో ఇటీవల జరిగిన కొన్ని కొనుగోళ్లు, ప్రాజెక్టులు ఖర్చుల పరంగా ప్రశ్నలు రేకెత్తిస్తున్నాయి. పరిమిత సంఖ్యలో కంప్యూటర్లు, ప్రింటర్ల కొనుగోలుకు భారీగా నిధులు వెచ్చించడంపై సందేహాలు డ్రోన్ సర్వేలు, ఏ ఐ విశ్లేషణ పేరుతో అధిక చెల్లింపులు ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ (పి ఎం యూ) కన్సల్టెన్సీలకు సంవత్సరానికి భారీ వ్యయం ఈ ఖర్చులు మార్కెట్ ధరలతో పోలిస్తే అధికంగా ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**అంచనాల్లో పెరుగుదల – పనుల్లో అనుమానాలు**

రహదారులు, ఎలక్ట్రికల్ పనులలో అంచనాలు అసాధారణంగా పెంచుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొలతల్లో వ్యత్యాసాలు పూర్తి కాని పనులకు బిల్లులు ధరల పెంపు పేరుతో అదనపు నిధుల మళ్లింపు ఈ విధానాలు వ్యవస్థపై ప్రజల్లో అనుమానాలను పెంచుతున్నాయి.

**నిజాయితీ అధికారులకు ఇబ్బందులు?**

సంస్థలో విధి నిర్వహణలో కట్టుదిట్టంగా ఉండే అధికారులకు ఇబ్బందులు కలుగుతున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి.

**పరిపాలన నిర్ణయాల్లో జోక్యం**

సీనియర్ సిబ్బంది పదవీ విరమణ అంశాలపై వివాదాలు, కీలక అధికారులను ఇతర శాఖలకు పంపించే చర్యలు, ఈ పరిణామాలు పరిపాలనా వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయని ఉద్యోగ వర్గాలు అంటున్నాయి.

**బోర్డు పాత్రపై ప్రశ్నలు**

సంస్థ బోర్డు తీసుకునే నిర్ణయాలపై కూడా విమర్శలు ఉన్నాయి. కీలక నిర్ణయాల్లో చర్చకు తావులేకుండా, కేవలం ఆమోద ముద్ర వేయడమే జరుగుతోందా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**భవిష్యత్తుపై ఆందోళన**

ఈ పరిస్థితులు కొనసాగితే సంస్థ ఆర్థిక స్థితి దెబ్బతింటుందని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీతాలు, పెన్షన్ల చెల్లింపులు కూడా కష్టమయ్యే పరిస్థితి తలెత్తవచ్చని హెచ్చరిస్తున్నారు. తక్షణ చర్యల అవసరం

**ప్రజా నిధుల వినియోగంపై పారదర్శకత కోసం:**

ఉన్నత స్థాయి విచారణ. టెండర్ ప్రక్రియలో సంస్కరణలు ఖర్చులపై ఆడిట్ బాధ్యులపై చర్యలు ఇవి అత్యవసరంగా అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

## ప్రభుత్వం ఏర్పాటుకు విజయ్‌ను ఆహ్వానించిన గవర్నర్

లోక్ భవన్ ఆహ్వాన ప్రకటన విడుదల
సాయంత్రం 4 గంటలకు గవర్నర్‌ను కలవనున్న విజయ్
విజయ్‌కు మద్దతిచ్చేందుకు సిద్ధమైన కాంగ్రెస్



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుచుకున్న టీవీకే పార్టీ అధినేత విజయ్‌కు ప్రభుత్వం ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానం పంపించారు. ఈ మేరకు ఆహ్వాన ప్రకటనను లోక్ భవన్ విడుదల చేసింది. ఈరోజు సాయంత్రం 4 గంటలకు విజయ్ గవర్నర్‌ను కలుస్తారు. టీవీకేకు మద్దతిస్తామని ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ తెలిపింది. అన్నాడీఎంకే పార్టీలోనూ పలువురు ఎమ్మెల్యేలు టీవీకేకు మద్దతు ఇవ్వాలని చెబుతున్నారు. ఈ క్రమంలో, విజయ్ పార్టీ బలాన్ని నిరూపించుకోవడం కష్టమేమీ కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 234 స్థానాలున్న

తరువాయి 2లో..

## హార్టికల్చర్‌పై ప్రత్యేక దృష్టి..

### బ్యాంకులకు సీఎం చంద్రబాబు కీలక సూచనలు

**2026-27 ఆర్థిక సంవత్సరానికి నాబార్డు రుణ ప్రణాళిక విడుదల**
**రూ.5.11 లక్షల కోట్లతో స్టేట్ ఫోకస్ పేపర్ ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు**
**వ్యవసాయ రంగానికి రూ.2.55 లక్షల కోట్లు, ఎంఎస్‌ఎంఈలకు రూ.1.64 లక్షల కోట్లు**



**అమరావతి, సిటిజన్ టైమ్స్**

ఆంధ్రప్రదేశ్‌లో ప్రాధాన్యతా రంగాలకు రుణ పరపతిని పెంచే లక్ష్యంతో 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను నాబార్డు రూపొందించిన రుణ ప్రణాళికను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆవిష్కరించారు. ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో నిన్న జరిగిన ఈ కార్యక్రమంలో రూ.5,11,491 కోట్లతో కూడిన ‘స్టేట్ ఫోకస్ పేపర్’ను ఆయన విడుదల చేశారు. గతేడాది (2025-26) ప్రణాళిక అయిన రూ.4.24

తరువాయి 2లో..

## పాపికొండల యాత్ర నిలిపివేత

పాపికొండల విహారయాత్రకు తాత్కాలిక విరామం
ఈదురుగాలులు, అకాల వర్షాల కారణంగా యాత్ర నిలిపివేత
వాతావరణ పరిస్థితులు మెరుగుపడిన తర్వాత యాత్రను పునరుద్ధరిస్తామన్న అధికారులు

తరువాయి 2లో..



## ఏపీకి రూ.1000 కోట్ల పెట్టుబడి.. క్యారియర్ ఏసీ పరిశ్రమకు మంత్రి లోకేశ్ శంకుస్థాపన

- శ్రీసిటీలో క్యారియర్ ఏసీల తయారీ యూనిట్‌కు శంకుస్థాపన చేసిన మంత్రి
- రూ.1000 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు.. 3000 మందికి ఉపాధి అవకాశాలు
- సీఎం చంద్రబాబు తన గదిని 17లీజ వద్ద ఉంచుతారని లోకేశ్ సరదా వ్యాఖ్య
- డేటా సెంటర్లను ఆకర్షించడమే కాదు, వాటి తయారీ వ్యవస్థనే నిర్మిస్తున్నామన్న లోకేశ్
- డేటా సెంటర్ల రంగంలో ఏపీ అగ్రగామిగా నిలుస్తుందని ధీమా

**అమరావతి, సిటిజన్ టైమ్స్**

ఏపీని పారిశ్రామికంగా, సాంకేతికంగా అగ్రస్థానంలో నిలబెట్టే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా తిరుపతి జిల్లాలోని శ్రీసిటీలో ప్రపంచ ప్రసిద్ధ ఎయిర్ కండిషనర్ల తయారీ సంస్థ ‘క్యారియర్ గ్లోబల్’ యూనిట్‌కు రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు కోసం క్యారియర్ సంస్థ సుమారు రూ. 1,000 కోట్ల భారీ పెట్టుబడి పెట్టనుంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 3,000 మందికి ఉపాధి, జీవనోపాధి అవకాశాలు లభించనున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ... క్యారియర్ కేవలం ఒక కంపెనీ కాదని, ప్రపంచ శీతలీకరణ సాంకేతికతలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన మార్గదర్శి అని ప్రశంసించారు. తన

తరువాయి 2లో..



# ఎడిటోరియల్


## బాబు...లోకేష్ లను కూల్ చేసేది ఏంటంటే ?

ఏపీలో సరికొత్త పరిశ్రమ వచ్చింది. తిరుపతి జిల్లాలోని శ్రీ సిటీలో క్యారియర్ గ్లోబల్ కార్పొరేషన్ కి మంత్రి నారా లోకేష్ తాజాగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యారియర్ ఏసీ సంస్థ గురించి పలు విషయాలు పంచుకున్నారు. తన తొలి ఏసీ చాయిస్ క్యారియర్ అని అన్నారు. అంతే కాదు ముఖ్యమంత్రి చంద్రబాబు రూం లో వాడే ఏసీ కూడా క్యారియర్ అని ఆయన గుర్తు చేశారు. బాబు రూం లో 17 డిగ్రీల సెల్సియస్ టెంపరేచర్ తో అది బ్రహ్మాండంగా పనిచేస్తోందని లోకేష్ చెప్పడం విశేషం. ఆంధ్రప్రదేశ్ ఈ రోజు అతి పెద్ద పారిశ్రామిక హబ్ గా మారుస్తున్నామని మంత్రి లోకేష్ చెప్పారు. అందులో భాగంగానే తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గంలోని శ్రీసిటీలో వెయ్యి కోట్ల రూపాయలతో నూతనంగా నిర్మించనున్న క్యారియర్ ఎసి పరిశ్రమకు శ్రీకారం చుట్టామనిఅన్నారు. అమెరికాకు చెందిన క్యారియర్ గ్లోబల్ కార్పొరేషన్ శ్రీసిటీలో ఏర్పాటు చేస్తున్న క్యారియర్ ఏసీ తయారీ యూనిట్ ద్వారా ప్రత్యక్షంగా పరోక్షంగా స్థానికంగా మూడు వేల మంది నిరుద్యోగ యువతకి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని లోకేష్ ప్రకటించారు. ఈ ప్రాజెక్టు ద్వారా గృహేతర అవసరాలకు అనువైన ఆధునిక ఏసీ ఉత్పత్తులు తయారీ జరుగుతుందని ఆయన తెలిపారు. రానున్న రోజులలో రాష్ట్రానికి మరిన్ని పరిశ్రమలు రానున్నాయని లోకేష్ చెబుతూ టీడీపీ టమి ప్రభుత్వంపై నమ్మకంతో పెట్టుబడిదారులు ఏపీకి వస్తున్నారని అన్నారు. ఏపీ కేవలం డేటా సెంటర్లకు ఆతిథ్యమిచ్చే కేంద్రంగా ఉండటంతో సంతృప్తి చెందడం లేదని లోకేష్ చెప్పుకొచ్చారు. అందుకే వాటిని నడిపించే చోదక శక్తిగా మారడానికి ప్రభుత్వం గట్టి ప్రయత్నం చేస్తోందని అన్నారు. తమ ఆలోచనలకు క్యారియర్ గ్లోబల్ కార్పొరేషన్ ఒక మూల స్తంభమని ఆయన అభివర్ణించారు. క్యారియర్ గ్లోబల్ కార్పొరేషన్ ప్రాజెక్ట్ వేగాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు. ఏపీలో క్యారియర్ సంస్థ శ్రీకారం చుట్టడం కార్యక్రమం అంతా కేవలం ఎనిమిది నెలల్లోనే ముందుకు సాగిందని ఇలా పని చేసే వేగం పారిశ్రామికవేత్తల పట్ల కూటమి ప్రభుత్వ నిబద్ధతను చూపిస్తాయని తెలియచేస్తుందని లోకేష్ స్పష్టం చేశారు. ఏపీలో ఫుల్ స్టాక్ డేటా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎకోసిస్టమ్ని నిర్మించడమే లక్ష్యమని ఐటీ మంత్రి లోకేష్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. అలాగే ఏఐ క్లౌడ్ హై పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్ కోసం క్యారియర్ అధునాతన కూలింగ్ టెక్నాలజీ అత్యంత కీలకమని లోకేష్ గుర్తు చేశారు. శ్రీ సిటీలోని క్యారియర్ సన్న 39 ఎకరాల ప్లాంట్ ఎయిర్ కండిషనింగ్ తయారీకి కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ స్థానాన్ని బలోపేతం చేస్తుందని లోకేష్ చెప్పారు. 2027 నాటికి భారత దేశంలో 60 శాతం ఏసీలను ఈ సంస్థ ద్వారా ఏపీ ఉత్పత్తి చేస్తుందని అంచనా ఉంది.

# మూగజీవుల మౌన మరణాలు...

# బాధ్యత ఎవరిది?

## మాటలేని జీవుల మౌన కేకలు... వినిపించచడంలేదా?




**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

నగరాల్లో పెరుగుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు మూగజీవుల ప్రాణాలకు పెద్ద ముప్పుగా మారుతున్నాయి. ముఖ్యంగా ఆవులు వంటి నిరాధార జంతువులు సరైన ఆహారం దొరకక రోడ్లపై తిరుగుతూ చెత్త కుండీలలో పడేసిన ఆహారాన్ని తింటున్నాయి. అయితే ఆహారంతో పాటు ప్లాస్టిక్ సంచులు, కవర్లు, ఇతర వ్యర్థాలను మింగడం వల్ల అవి తీవ్ర ఆరోగ్య సమస్యలకు గురై నిశ్శబ్దంగా ప్రాణాలు కోల్పోతున్నాయి. పశు వైద్యుల వివరాల ప్రకారం, ఆవులు మింగిన ప్లాస్టిక్ కడుపులో జీర్ణం కాక పేరుకుపోయి జీర్ణక్రియను పూర్తిగా దెబ్బతీస్తుంది. దీంతో అవి ఆకలి తగ్గి, తీవ్రమైన నొప్పితో బాధపడుతూ క్రమంగా మరణానికి దారితీస్తుంది. అనేక సందర్భాల్లో శస్త్రచికిత్సల ద్వారా ఆవుల కడుపులో భారీ మొత్తంలో ప్లాస్టిక్ బయటపడటం పరిస్థితి ఎంత భయానకంగా ఉందో స్పష్టం చేస్తోంది. దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం వందల నుంచి వేల సంఖ్యలో ఆవులు ప్లాస్టిక్ కారణంగా మరణిస్తున్నాయని అంచనాలు చెబుతున్నాయి. నగరాల్లో చెత్తను బహిరంగంగా పడేయడం, ప్లాస్టిక్ సంచుల్లో ఆహారం వేయడం, చెత్త నిర్వహణలో లోపాలు ఈ సమస్యకు ప్రధాన కారణాలుగా మారాయి. ప్రజల నిర్లక్ష్యంతో పాటు, మున్సిపల్ వ్యవస్థల వైఫల్యం కూడా ఈ పరిస్థితిని మరింత విషమం చేస్తోంది. నగరాల్లో తిరిగే నిరాధార పశువులకు సరైన గోశాలలు లేకపోవడం, ఉన్న వాటిలో సరిపడా సదుపాయాలు లేకపోవడం మరో కీలక సమస్యగా నిలుస్తోంది. ఫలితంగా ఆవులు రోడ్లపైనే తిరుగుతూ చెత్తపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇదే సమయంలో ట్రాఫిక్ ప్రమాదాలు, ప్లాస్టిక్ మింగడం వంటి కారణాలతో రోజూ అనేక మూగజీవులు ప్రాణాలు కోల్పోతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. ప్లాస్టిక్ వినియోగంపై కఠిన నియంత్రణలు అమలు చేయడం, చెత్త నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేయడం అత్యవసరం. ప్రతి మున్సిపాలిటీ పరిధిలో పశు సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి నిరాధార ఆవులకు ఆహారం, నీరు, వైద్యం, ఆశ్రయం కల్పించాలి. రోడ్లపై చెత్త వేస్తున్న వారిపై కఠిన జరిమానాలు విధించి ప్రజల్లో బాధ్యత పెంచాలి. ఇదే సమయంలో ప్రజలు కూడా తమ బాధ్యతను గుర్తించాలి. మూగజీవులు మాట్లాడలేవు కానీ మన నిర్లక్ష్యం వల్ల అవి ప్రాణాలు కోల్పోతున్నాయి. చెత్తను సరిగా పడేయడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, అవసరమైనప్పుడు జంతువులకు ఆహారం అందించడం వంటి చర్యలు తీసుకోవడం అత్యవసరం.ప్లాస్టిక్ కాలుష్యం కేవలం పర్యావరణ సమస్య మాత్రమే కాదు ఇది మూగజీవుల ప్రాణాలను హరిస్తున్న మానవ నిర్లక్ష్యానికి ప్రతిబింబం. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు, ప్రజలు కలిసికట్టుగా చర్యలు తీసుకుంటేనే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. లేకపోతే మరెన్నో మూగజీవులు నిశ్శబ్దంగా ప్రాణాలు కోల్పోతూనే ఉంటాయి.

# పోక్సో చట్టం ఎమి చెబుతుంది..?




పిల్లలపై లైంగిక దాడులను నిరోధించే చట్టమే పోక్సో చట్టం (పోక్సో యాక్ట్ ). పూర్తి పేరు ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్సెస్ యాక్ట్ 2012 –18 ఏళ్లలోపు పిల్లలందరికీ లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పిస్తుంది. 12 సంవత్సరాల కంటే తక్కువ వయసున్న బాలికలపై అత్యాచారానికి పాల్పడే నిందితులకు కఠినమైన శిక్ష అమలయ్యేలా ఈ చట్టాన్ని రూపొందించారు. వారిపై అత్యాచారానికి పాల్పడ్డ దోషులకు మరణశిక్ష విధిస్తారు. అయితే, ఈ చట్టం గురించి చాలా మంది తల్లిదండ్రులకు తెలియదు. దీని గురించి ప్రతి విద్యాసంస్థల్లోనూ అవగాహన కల్పిస్తే చాలావరకూ పిల్లలపై లైంగిక దాడులను అడ్డుకోవచ్చు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లల తల్లిదండ్రులు ఎక్కువ శాతం నిరక్షరాస్యులే. వారికి ఇటువంటి చట్టాలమీద అవగాహన తక్కువ. పిల్లలను చేర్పించినప్పుడే ఈ చట్టం గురించి అవగాహన కల్పిస్తే మంచిది. టీచర్లు కూడా వాట్ ఈజ్ గుడ్ టచ్, వాట్ ఈజ్ బ్యాడ్ టచ్ అదే దానిపై అవగాహన కల్పించాలి. అసభ్యంగా ప్రవర్తిస్తే ఎలా ఎదుర్కోవాలో, ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియజేయాలి.

1.పోక్సో చట్టం భారతదేశంలో ఎందుకు అవసరం ?

భారతదేశములో 35% మంది 18సం?ల వయస్సు లోపు బాలలే. బాలలపై లైంగిక దోపిడీ గురించి 2007లో జరిగిన ఒక అధ్యయనంలో 53% బాలలు ఏదో ఒక రకమైన లైంగిక వేధింపు, దాడులకు గురయ్యారని తేలింది. బాలలపై ఈవిధంగా హక్కుల ఉల్లంఘన నుండి కాపాడడానికి, చట్టంపరంగా రక్షణ కల్పించడానికి ఈ చట్టం రూపొందించారు.

2.పోక్సో చట్టం రూపొందించడానికి, అమలు పరచడంలో ముఖ్య ఉద్దేశ్యమేమిటి ?

భారత శిక్షాస్మృతిలో అన్ని రకాల లైంగిక నేరాల గురించి వివరణ లేదు, మరియు బాలలపై, పెద్దలపై జరిగే నేరాలకు వ్యత్యాసం, వివరణ లేదు. వయస్సు తేడాలను పరిగణనలోకి తీసుకోలేదు.

3.పోక్సో చట్టంలో ముఖ్యాంశాలు ఏమిటి ?

పోక్సో చట్టం 18సం.ల వయస్సు లోపల గల బాలల కోసం రూపొందించారు. ఈ చట్టంలో బాలురు, బాలికలు అనే తేడా లేకుండా జరిగిన లైంగిక వేధింపులు, చొప్పించబడిన, చొప్పించబడని లైంగిక దాడి, దారుణమైన లైంగికదాడి, అశ్లీల సాహిత్యం, వెంబడించడం వంటి అంశాలను విడివిడిగా విభజించి, ఆ నేరాలకు శిక్ష విధించడం జరిగింది.

4.పోక్సో చట్టంలో శిక్ష ఏవిధంగా నిర్ధారిస్తారు ?

పోక్సో చట్టంలో జరిగిన నేరం తీవ్రతను బట్టి నేరాన్ని వర్గీకరించి, శిక్ష విధించడమైనది. సాధారణ కారాగారశిక్ష నుండి కఠిన కారాగార శిక్ష, జీవితకాలఖైదు మరియు మరణశిక్ష వరకు కోర్టు వ్యవధిని నిర్ధారించి, విధించవచ్చు. దానితోపాటు కోర్టు జరిమానా కూడా విధించవచ్చు.

కేసులో ఉదాహరణ 1:

2016 లో మైనర్ బాలికపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో ఎస్సీ, ఎస్టీ, పోక్సో కేసుల ఫాస్ట్ ట్రాక్ కోర్టు నల్లగొండ జిల్లా అదనపు జడ్జి ఎన్. రోజారమణి ముద్దాయికి 20 సంవత్సరాలు జైలు శిక్ష తో పాటుగా 35 వేలు జరిమానా, బాధితురాలికి 10 లక్షల రూపాయలు పరిహారం చెల్లించాలని తీర్పు వెల్లడించారు.

కేసులో ఉదాహరణ 2:

చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి ప్రత్యేక పోక్సో కోర్ట్ కఠిన శిక్ష విధించింది. విచారణలో అన్ని సాక్ష్యాలను సమగ్రంగా పరిశీలించిన న్యాయస్థానం, నిందితుడిని దోషిగా తేల్చి జీవిత ఖైదుతో పాటు రూ.50,000 జరిమానా విధించింది.ప్రాసిక్యూషన్ సమర్పించిన మెడికల్ రిపోర్టులు, బాధితురాలి వాంగ్మూలం, ఫోరెన్సిక్ ఆధారాలు కేసును బలపరిచాయి. నిందితుడు చిన్నారి విశ్వాసాన్ని దుర్వినియోగం చేసుకున్నాడని కోర్టు గమనించింది. న్యాయమూర్తి వ్యాఖ్యానిస్తూ, "చిన్నారులపై జరిగే నేరాలు సమాజానికి మచ్చ. ఇలాంటి ఘటనలకు కఠిన శిక్షలు అవసరం" అని స్పష్టం చేశారు.

**జె కనక దుర్గ లక్ష్మీ**
**ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ (IHR)**
**ఉత్తరాంధ్ర ఇంచార్జి**

# మొదటి పేజీ తరువాయి

## ప్రభుత్వం ఏర్పాటుకు విజయ్‌ను ఆహ్వానించిన గవర్నర్

తమిళనాడు అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి కావాల్సిన బలం 118. విజయ్ పార్టీ 108 స్థానాల్లో గెలుపొందగా, మరో పదిమంది ఎమ్మెల్యేలు తక్కువ పడుతున్నారు. ఈ నేపథ్యంలో విజయ్‌కి మద్దతిచ్చేందుకు వివిధ పార్టీలు మొగ్గ చూపుతున్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వ ఏర్పాటుపై తమిళనాడు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ మాట్లాడుతూ, తనకు టీవీకే నుంచి ఒక లేఖ అందిందని తెలిపారు. వారు ఈరోజు సాయంత్రం తనను కలుస్తారని అన్నారు. తమకు మెజారిటీ ఉందని, ప్రభుత్వ ఏర్పాటుకు తమను ఆహ్వానించాలని వారు కోరినట్లు చెప్పారు. ఈరోజు సాయంత్రం విజయ్ తన అపాయింట్‌మెంట్ కోరారని తెలిపారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరనుందని అన్నారు.

## ఏపీకి రూ.1000 కోట్ల పెట్టుబడి.. క్యారియర్ ఏసీ పరిశ్రమకు మంత్రి లోకేశ్ శంకుస్థాపన

జీవితంలో కొనుగోలు చేసిన మొట్టమొదటి ఏసీ కూడా క్యారియర్ బ్రాండ్‌దేనని ఆయన గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఒక ఆసక్తికరమైన విషయాన్ని పంచుకుంటూ, సీఎం చంద్రబాబు నాయుడు తన గదిని ఎప్పుడూ 17 డిగ్రీల సెల్సియస్ వద్ద చల్లగా ఉంచుకోవడానికి ఇష్టపడతారని, ఇప్పుడు ఆ గదిలో కూడా క్యారియర్ ఏసీనే ఉందని లోకేశ్ సరదాగా వ్యాఖ్యానించారు. దీంతో సభలో నవ్వులు పూశాయి.

**డేటా సెంటర్ల తయారీ హబ్‌గా ఏపీ**

అనంతరం మంత్రి లోకేశ్ రాష్ట్ర భవిష్యత్ ప్రణాళికలపై తన దార్శనికతను ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్‌ను కేవలం డేటా సెంటర్లను ఆకర్షించే రాష్ట్రంగా కాకుండా వాటికి అవసరమైన పూర్తి తయారీ పర్యావరణ వ్యవస్థను (ఎకోసిస్టమ్) నిర్మించే హబ్‌గా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. "మేం కేవలం డేటా సెంటర్లను నిర్మించడం లేదు, వాటికి అవసరమైన పూర్తి వ్యవస్థను ఇక్కడే నిర్మిస్తున్నాం" అని ఆయన అన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా డేటా సెంటర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో తీవ్రమైన పోటీ నెలకొని ఉందని, ఈ రేసులో ఏపీ ముందు వరుసలో నిలుస్తుందని లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు. డేటా సెంటర్లకు అత్యాధునిక కూలింగ్ సిస్టమ్స్, అధిక సామర్థ్యం గల చిల్లర్లు, పవర్ ఎలక్ట్రానిక్స్, ప్రెసిషన్ మాన్యుఫ్యాక్చరింగ్ వంటివి అత్యంత కీలకమని, వీటికి అవసరమైన బలమైన సహాయక పర్యావరణ వ్యవస్థను నిర్మించడంపై దృష్టి సారించామని వివరించారు. ఈ బృహత్తర లక్ష్యంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌ను, శ్రీసిటీని ఎంచుకున్నందుకు క్యారియర్ గ్లోబల్ కార్పొరేషన్‌కు ఆయన స్వాగతం పలికారు. ఈ పెట్టుబడి రాష్ట్ర డిజిటల్, పారిశ్రామిక అభివృద్ధిని బలోపేతం చేసే దిశగా ఒక ముఖ్యమైన ముందడుగు అని ఆయన అభివర్ణించారు. క్యారియర్ వంటి సంస్థల రాకతో, డేటా సెంటర్లకు అవసరమైన కీలక పరికరాల తయారీ స్థానికంగానే జరిగి, ఆంధ్రప్రదేశ్ గ్లోబల్ టెక్నాలజీ మ్యాప్‌లో తన స్థానాన్ని మరింత పదిలం చేసుకుంటుందని మంత్రి లోకేశ్ తెలిపారు.

## పాపికొండల యాత్ర నిలిపివేత

**అమరావతి, సిటిజన్ టైమ్స్**

తెలుగు రాష్ట్రాల పర్యాటకులకు అధికారులు చేదువార్త చెప్పారు. గోదావరి నదిలో అత్యంత ఆదరణ పొందిన 'పాపికొండల విహారయాత్ర'ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు జలవనరుల శాఖ ప్రకటించింది. ప్రస్తుతం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన అకాల వర్షాలు కురుస్తుండటంతో, పర్యాటకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ యాత్రను రద్దు చేస్తున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. వాతావరణ పరిస్థితులు మెరుగుపడి, పర్యావరణం అనుకూలించిన తర్వాతే విహారయాత్రను పునరుద్ధరిస్తామని యంత్రాంగం వెల్లడించింది. యాత్ర పునఃప్రారంభానికి సంబంధించిన తదుపరి వివరాలను త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తామని, అప్పటివరకు పర్యాటకులు అధికారులకు సహకరించాలని కోరారు. ముఖ్యంగా నదీ ప్రవాహంలో ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

## హార్టికల్చర్‌పై ప్రత్యేక దృష్టి..

లక్షల కోట్లతో పోలిస్తే ఇది దాదాపు 20 శాతం అధికం కావడం గమనార్హం. ఈ రుణ ప్రణాళికలో వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ రూ.2.55 లక్షల కోట్లు కేటాయించారు. ఇందులో పంట రుణాల కోసం రూ.1.66 లక్షల కోట్లు కేటాయించారు. అదేవిధంగా, రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో కీలకమైన సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ)కు రూ.1.64 లక్షల కోట్లు కేటాయించడం జరిగింది. పశుసంవర్ధక శాఖకు రూ.34,972 కోట్లు, మత్స్య రంగానికి రూ.21,098 కోట్లు కేటాయించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. హార్టికల్చర్‌ను ప్రోత్సహించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి బ్యాంకులు, నాబార్డు అధికారులు పూర్తి మద్దతు అందించాలని పిలుపునిచ్చారు. ఏటా 450 లక్షల మెట్రిక్ టన్నుల హార్టికల్చర్ ఉత్పత్తులను సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ముఖ్యంగా రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో ఉద్యాన పంటల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా రూ.5,313 కోట్లు కేటాయించడం శుభపరిణామమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాబార్డు సీజీఎం ఎం.ఆర్. గోపాల్, జీఎం కే.వి.ఎస్. ప్రసాద్‌తో పాటు ఎస్ఎల్‌బీసీ, ఎస్‌బీఐ, కెనరా బ్యాంక్, ఏపీ గ్రామీణ బ్యాంక్, ఆప్కాబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు హాండ్స్ ఆన్ బోధన చేయాలి

## -హాండ్స్ ఆన్ ఆక్టివిటీ ని విద్యా బోధన సామర్థ్యం పెంచుకోవాలి - అనుభవాత్మక బోధనా పద్ధతి అవసరం

## - బోధనా సామగ్రి తయారు చేయడం అవసరం - ప్రేమ్ కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి, విశాఖపట్నం

**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మే 06**

సైన్స్ ఉపాధ్యాయులు హాండ్స్ ఆన్ ప్రాక్టీకల్స్ నిర్వహించడం ద్వారా భోధనను మెరుగు పరచుకోవాలి అని విశాఖపట్నం జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమ్ కుమార్ కోరారు. అక్కయ్యపాలెం లో ఒక ప్రైవేటు హెటల్ లో రెండు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్ర స్థాయి బయాలజికల్ సైన్స్ ఉపాధ్యాయులు ( ఆంధ్రప్రదేశ్ బయాలాజికల్ టీచర్స్ ఫోరం) బోధనా సామర్థ్యం పెంపొందించే కార్యశాల లో ఆయన మాట్లాడారు.అలాగే కృత్రిమ మేధ (ఏఐ) తొ విద్యా బోధన సామర్థ్యం పెంచుకోవాలని సూచించారు. అంతేకాక ఉపాధ్యాయులు అనుభవాత్మక బోధనా పద్ధతి అవలంభించడం అవసరం అన్నారు. సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జోగా చంద్రశేఖర్ 6వ మరియు 7వ తరగతులకు సంబంధించిన నూతన పాఠ్య పుస్తకాల విషయం లో తమ అనుభవం ఆధారంగా తయారు చేయాలి అన్నారు. ఆంధ్రప్రదేశ్ బయాలాజికల్ టీచర్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు నీలకంఠ మారుతున్న 6,7,8 తరగతులలో ఉన్న సైన్స్ భావనలను ప్రయోగ పూర్వకంగా ఎలా చెప్పాలో ఇక్కడ ప్రాక్టికల్ గా నేర్పుతున్నాం అన్నారు. ఫోరమ్ ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ గౌస్ మాట్లాడుతూ ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ఉపాధ్యాయుల వృత్తి అభివృద్ధికి ఎంతో దోహదపడతాయని, ప్రాక్టికల్స్ ద్వారా, సాంకేతికత ద్వారా బోధన మరింత ప్రభావవంతంగా మారుతుందని అన్నారు. ప్రధానంగా రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం లో బోధనా సామగ్రి తయారీ, పాఠ్య ప్రణాళికలు,



ప్రజెంటేషన్లు, పోస్టర్లు, విద్యా వీడియోల తయారీ, మూల్యాంకన సౌలభ్యం, తక్కువ సమయంలో ఎలా పిల్లలకు ఎలా అర్థం అయ్యేలాగా చెప్పడానికి వ్యూహాలు, నెమ్మదిగా నేర్చుకునే విద్యార్థులకు అనుకూల బోధన పద్ధతులు గురించిన శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యక్షురాలు ఉమ, అకాడమిక్ కన్వీనర్ జాకీర్ అహ్మద్,విశాఖ జిల్లా అధ్యక్షులు ఎం.వి. విశ్వేశ్వరరావు, సురేంద్ర, వేణు గోపాల్ రావు, ఆర్పీ డేవిడ్, సజీవ రాజు తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు అందరూ పెద్ద వాల్తేరు లో ఉన్న బయోలాజికల్ పార్క్ ను సందర్శించారు. అక్కడ ఉన్న ఔషధ మొక్కలు గురించి డాల్ఫిన్ నేచర్ కన్సర్వేషన్ సొసైటీ వ్యవస్థాపకులు రామమూర్తి, విశ్రాంత ఉపాధ్యాయులు మంగతాయారు వివరించారు. అలాగే గ్రీన్



క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం పర్యావరణ కాలమానిని ఆధారంగా చేసుకుని పర్యావరణ దినోత్సవాలు నిర్వహించాలని కోరారు. అందరికీ కారణానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా 50 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# స్వచ్ఛందంగా రక్తదానం చేయండి: డీఆర్వో పిలుపు



**విశాఖపట్నం,సిటిజన్ టైమ్స్, మే:06**

ప్రతి ఉద్యోగి, పౌరుడు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం. విశ్వేశ్వరనాయుడు పిలుపు నిచ్చారు. మే 08న జరగనున్న ఇండియన్ రెడ్ క్రాస్ డే సందర్భంగా నిర్వహించాల్సిన కార్యక్రమాలపై బుధవారం ఆయన వివిధ శాఖల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. రక్తదానం ప్రాణాలను రక్షించే మహత్తర సేవ అని పేర్కొన్న ఆయన, అందరూ ఈ సేవలో భాగస్వాములు కావాలని కోరారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, శాఖలు పరస్పర సమన్వయంతో కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆదేశించారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా ఇండియన్ రెడ్ క్రాస్ భవనంలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రతి ఉద్యోగి స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేయాలని పునరుద్ఘాటించారు. ప్రజల్లో రక్తదానం పట్ల అవగాహన పెంచేందుకు విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# విశాఖలో విద్యాసంస్థల బస్సులపై ప్రత్యేక తనిఖీలు




**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మే:06**

జిల్లాలో విద్యాసంస్థలకు చెందిన బస్సులపై నిర్వహిస్తున్న ప్రత్యేక తనిఖీలు కొనసాగుతున్నాయని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మణికుమార్ తెలిపారు. ఏప్రిల్ 28 నుంచి ఇప్పటివరకు మొత్తం 1,250 బస్సులలో 368 బస్సులను పరిశీలించినట్లు ఆయన వెల్లడించారు. ఈ తనిఖీలలో 76 బస్సులు నిర్దేశిత భద్రతా ప్రమాణాలను పాటించడం లేదని గుర్తించినట్లు చెప్పారు. సంబంధిత విద్యాసంస్థలకు నోటీసులు జారీ చేసి, లోపాలను వారం రోజుల్లో సరిచేసి, సంబంధిత ఎంవీఐ/ఏఎంవీఐ సమక్షంలో డీటీసీ కార్యాలయంలో వాహనాలను హాజరుపరచాలని ఆదేశించినట్లు తెలిపారు. విద్యార్థుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేస్తూ, నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

# బాల్యం కేంద్రాల్లో ఉచిత విద్యకు అడ్మిషన్లు ప్రారంభం - తల్లిదండ్రులకు జీవీఎంసీ కమిషనర్ పిలుపు



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మే :06**

మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) పరిధిలోని బాల్యం విద్యా కేంద్రాల్లో 2026--27 విద్యా సంవత్సరానికి 3 నుంచి 5 సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు ఉచిత పూర్వ ప్రాథమిక విద్య కోసం అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ పిల్లలను బాల్యం కేంద్రాల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పిలుపునిచ్చారు. బుధవారం కమిషనర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో అడ్మిషన్ల నమోదును పెంచేందుకు అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని ఆయన అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా పూర్తి సమాచారంతో కూడిన కరపత్రం, సోషల్ మీడియా పోస్టర్లను విడుదల చేశారు. అంగన్వాడి కేంద్రాలు లేని ప్రాంతాలు మరియు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాల చిన్నారులకు నాణ్యమైన, విలువలతో కూడిన పూర్వ ప్రాథమిక విద్య అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని కమిషనర్ తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలలో ఫీజులు చెల్లించలేని తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వేసవి సెలవులను ఉపయోగించుకుని నమోదు శాతం పెంచేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని, బాల్యం కేంద్రాల్లో సృజనాత్మక బోధన ద్వారా చిన్నారులను ప్రాథమిక విద్యకు సిద్ధం చేయాలని ఆయన పేర్కొన్నారు. తద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మొదటి తరగతిలో నమోదు పెరగాలని లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. తక్కువ ఖర్చుతో ఆకర్షణీయమైన, నాణ్యమైన పూర్వ ప్రాథమిక విద్య అందించడమే బాల్యం కేంద్రాల లక్ష్యమని, చిన్నారుల సృజనాత్మకతను పెంపొందించే విధంగా బోధన జరగాలని అధ్యాపకులకు దిశానిర్దేశం చేశారు. భావి పౌరులుగా పిల్లలను తీర్చిదిద్దే బాధ్యతను గుర్తుంచుకుని విద్యాబోధన నిర్వహించాలని ప్రాజెక్ట్ అధికారి హెచ్. శంకర్రావుకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఎస్.ఎస్. వర్మ, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఆవుపాటి మోహన్ కుమార్, బాల్యం అధ్యాపకులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

# పంచగ్రామాల భూ సమస్యపై సిపిఎం తుదిహెచ్చరిక

## కార్పొరేట్లకు సడలింపులు పేదలకు ఆంక్షలపై విమర్శలు




**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మే :06**

సింహాచలం పంచగ్రామాల భూ సమస్యపై ఇక ఆలస్యం సహించబోమని సిపిఎం ప్రభుత్వానికి తుదిహెచ్చరిక జారీ చేసింది. భూ హక్కుల సాధన కోసం కొనసాగుతున్న పాదయాత్ర నాలుగో రోజు వేపగుంట ప్రశాంతినగర్, విద్యానగర్, గౌతమ్‌నగర్ ప్రాంతాల్లో ఉధృతంగా సాగగా, ప్రజా ఆగ్రహం ఉవ్వెత్తున ఎగిసింది. కాలనీల్లోకి ప్రవేశించిన సిపిఎం నాయకత్వానికి ప్రజలు భారీగా తరలివచ్చి మద్దతు తెలపడంతో పాటు, "హామీలు వద్దు... జి.ఓ కావాలి", "మాకు పట్టాలు కావాలి" అంటూ నినాదాలతో మారుమోగించారు. దశాబ్దాలుగా భూ సమస్య పరిష్కారం పేరుతో ప్రభుత్వాలు ప్రజలను మభ్యపెడుతున్నాయని నాయకులు తీవ్రంగా విమర్శించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు బి. జగన్, బి. వెంకటరావు, పి. వెంకట్ రెడ్డి శాస్త్రి మాట్లాడుతూ, పంచగ్రామాల ప్రజలు 30 ఏళ్లుగా న్యాయం కోసం పోరాడుతున్నప్పటికీ ఇప్పటికీ శాశ్వత పరిష్కారం లభించకపోవడం పాలకుల వైఫల్యానికి నిదర్శనమన్నారు. ఇది సాధారణ భూ వివాదం కాదని, వేలాది కుటుంబాల జీవన్మరణ సమస్య అని స్పష్టం చేశారు. 1996-97లో చట్టబద్ధ ఆధారాలు లేకుండానే వేల ఎకరాలను సింహాచలం దేవస్థానం పేరుతో నమోదు చేయడం సమస్యకు మూలమని, అనంతరం జి.ఓ నెం.578 ద్వారా ప్రజలను ఆక్రమణదారులుగా ముద్ర వేయడం ఘోర అన్యాయమని ఆరోపించారు. ఇళ్లకు అనుమతులు ఇచ్చింది ప్రభుత్వం, సౌకర్యాలు కల్పించింది ప్రభుత్వం, పన్నులు వసూలు చేసింది ప్రభుత్వం--- ఇప్పుడు అదే ప్రభుత్వం ప్రజలను ఆక్రమణదారులుగా చూడడం దివాళా పాలనకు నిదర్శనమని ధ్వజమెత్తారు. 2017 స్టేటస్ కో పేరుతో ఇళ్ల రిజిస్ట్రేషన్లు, క్రయవిక్రయాలు, నిర్మాణాలు నిలిపివేసి ప్రజలను ఇళ్లలోనే బందీలుగా మార్చారని, కానీ కార్పొరేట్ కంపెనీలకు మాత్రం ఎలాంటి ఆంక్షలు లేవని విమర్శించారు. ఇది ప్రభుత్వ వర్గపక్షపాతాన్ని బహిర్గతం చేస్తోందన్నారు. 1903 గిల్మన్ సర్వే ప్రకారం దేవస్థానానికి కేవలం 39.5 ఎకరాలే ఉన్నాయని, అయితే వేల ఎకరాలపై హక్కు ఎలా వచ్చిందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సింహాచలం దేవస్థానానికి ఇచ్చిన రైత్వారీ పట్టాలను వెంటనే రద్దు చేసి, ప్రజల నివాస ఆధారాల ప్రకారం హక్కుదారులుగా గుర్తిస్తూ స్పష్టమైన జి.ఓ జారీ చేయాలని కోరారు. అలాగే అన్ని ఆంక్షలను ఎత్తివేసి, బెదిరింపులను పూర్తిగా నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పాదయాత్రలో మహిళలు, యువత, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొని "ఇక మౌనం కాదు---ఉద్యమమే మార్గం", "ప్రజ గర్జనతో జి.ఓ సాధిద్దాం" అంటూ నినాదాలు చేశారు. పంచగ్రామాల ప్రజలు ఐక్యంగా పోరాడితేనే ప్రభుత్వం దిగివస్తుందని, శాశ్వత పరిష్కారం వచ్చే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని సిపిఎం నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జోన్ నాయకులు వి. ప్రభావతి, కే. అప్పలనాయుడు, ఎన్. ప్రభుదేవ, ఈశ్వర్ రావు, మహేష్ రాజు, లక్ష్మి, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థినుల్లో భద్రతా చైతన్యం

## - విశాఖ పోలీసుల అవగాహన కార్యక్రమం



**విశాఖపట్నం,సిటిజెన్ టైమ్స్,మే :06**

విశాఖ నగర పోలీసుల ఆధ్వర్యంలో సెయింట్ జోసెఫ్ లేడీస్ కాలేజీలో విద్యార్థినుల కోసం ప్రత్యేక భద్రతా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళల భద్రత, చిన్నారుల రక్షణ, సైబర్ నేరాల నివారణపై నిపుణులు సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా శక్తి యాప్ డౌన్‌లోడ్ విధానం, వినియోగం, నైట్ షెల్టర్ వంటి భద్రతా ఫీచర్లపై అవగాహన కల్పించారు. సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు, తెలియని వ్యక్తులతో పరిచయాల వల్ల వచ్చే ప్రమాదాలు, ఫోటో మార్ఫింగ్, ఫేక్ కాల్స్, ఓటీపీ మోసాలు, ఏటీఎం మరియు ఇతర సైబర్ నేరాలపై విద్యార్థినులను అప్రమత్తం చేశారు. అలాగే డ్రగ్స్ దుష్ప్రభావాలు, పోక్సో చట్టం, అత్యవసర సహాయ నంబర్లు (112, 1098, 181), సెల్ఫ్ డిఫెన్స్ పద్ధతులపై కూడా వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థినుల్లో భద్రతపై చైతన్యం పెంపొందించి, స్వీయ రక్షణపై అవగాహన పెరిగిందని పోలీసులు తెలిపారు

# జోన్‌పై సంబరాలకంటే ఉక్కు కర్మాగారం రక్షణ ముఖ్యం: బి.వి.రామ్



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మే :06**

ప్రత్యేక రైల్వే జోన్‌ను విశాఖపట్నానికి తీసుకువచ్చిన ఘనత తమదేనని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఇటీవల విశాఖలో తెలుగు శక్తి ఆధ్వర్యంలో నిర్వహించిన "మేధోమధనం సమ్మేళనం" సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏ.బీ. వెంకటేశ్వరరావు పాలకుల తీరును తీవ్రంగా విమర్శించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. దివంగత ఎన్టీ రామారావు ప్రజలను దేవుళ్లుగా భావించేవారని, కానీ ప్రస్తుతం కొంతమంది రాజకీయ నాయకులు తమను తాము దేవుళ్లుగా భావిస్తూ ప్రజలను భక్తులుగా మార్చుకుంటున్నారని ఆయన వ్యాఖ్యానించినట్లు తెలిపారు. ఆ సదస్సు అనంతరం కొద్ది రోజుల వ్యవధిలోనే విశాఖ రైల్వే జోన్ గెజిట్ విడుదల కావడం గమనార్హమని, గత రెండేళ్లుగా సాధ్యం కాని విషయం అకస్మాత్తుగా సాకారం కావడం తెలుగు శక్తి చేపట్టిన మేధోమధనం కార్యక్రమ ప్రభావమేనని బి.వి.రామ్ పేర్కొన్నారు. రైల్వే జోన్ సాధనలో తమ పాత్రను విస్మరించి రాజకీయ పార్టీలు సంబరాలు జరుపుకోవడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. నిజంగా ప్రజల ప్రయోజనాలపై నిబద్ధత ఉంటే, ప్రైవేటీకరణ అంచున ఉన్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని కేంద్ర ప్రభుత్వం చేత ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. అలాంటి నిర్ణయం వచ్చినప్పుడు సంబరాలు చేసుకోవడం సమంజసం అవుతుందని అభిప్రాయపడ్డారు. విశాఖపట్నం సహా రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం తెలుగు శక్తి నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని, వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని బి.వి.రామ్ స్పష్టం చేశారు.

# కూలీలకు స్థిర ఆదాయం

## - కేంద్ర ప్రభుత్వ చర్యలు : దుక్కేరి ప్రభాకరరావు





**అల్లూరి జిల్లా, సిటిజన్ టైమ్స్, మే:05**

అల్లూరి సీతారామరాజు జిల్లా, చింతపల్లి మండలం లమ్మసింగి పంచాయితీ పరిధిలోని బురాడావీధి గ్రామంలో జరుగుతున్న వికసిత భారత్ ఉపాధి మరియు జీవనోపాధి హామీ మిషన్ (గ్రామీణ)" ఉపాధి హామీ పథకం పనులను బీజేపీ పార్టీ ఎఎస్ఆర్ జిల్లా కో-కన్వీనర్ దుక్కేరి ప్రభాకరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశమై పథకం అమలు, ప్రయోజనాలు, పారదర్శకతపై వివరంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఉపాధి హామీ పథకంలో పనిదినాలను 150 రోజులకు పెంచిందని తెలిపారు. ఈ చర్యతో పేద మరియు కూలీ వర్గాలకు స్థిరమైన ఆదాయం లభిస్తోందని చెప్పారు. గతంలో కొన్ని సందర్భాల్లో లబ్ధిదారులకు అందాల్సిన వేతనాలు పక్కదారి పట్టిన ఘటనలు ఉన్నప్పటికీ, ప్రస్తుతం ఫోటో ఆధారిత ఆన్‌లైన్ హాజరు విధానం (ఆన్‌లైన్ అటెండెన్స్) అమలు వల్ల అవకతవకలకు అడ్డుకట్ట పడిందని ఆయన స్పష్టం చేశారు. అలాగే, పనుల నిర్వహణలో పారదర్శకత పెరిగి, ప్రతి లబ్ధిదారునికి న్యాయం జరిగే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందడమే కాకుండా, నిరుద్యోగ సమస్య కొంతవరకు తగ్గుతుందని అభిప్రాయపడ్డారు. గ్రామస్తులు కూడా తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా వేతనాల చెల్లింపులో ఆలస్యం, పనుల లభ్యత, తాగునీరు మరియు ఇతర సౌకర్యాలపై అభ్యర్థనలు చేశారు. వాటిపై స్పందించిన ప్రభాకరరావు, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. చివరగా, వికసిత భారత్ ఉపాధి మరియు జీవనోపాధి హామీ మిషన్ (గ్రామీణ)" ఉపాధి హామీ పథకాన్ని ప్రతి అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వ పథకాలు ప్రజల జీవనోపాధిని మెరుగుపరచడానికే రూపొందించబడ్డాయని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, గ్రామ పెద్దలు, మహిళా సంఘ సభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# జలధారతో రాంపురం జెమ్మివాని చెరువుకు పూర్వ వైభవం





**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మే :06**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జలధార జలహారతి కార్యక్రమం కింద పెందుర్తి మండలం రాంపురంలోని జెమ్మివాని చెరువుకు మళ్లీ పూర్వ వైభవం తీసుకురావడానికి చర్యలు వేగవంతమయ్యాయి. సుమారు 50 ఎకరాల విస్తీర్ణం గల ఈ చెరువును రూ.19.73 లక్షల అంచనా వ్యయంతో పునరుద్ధరిస్తున్నారు. పెందుర్తి, రాంపురం గ్రామాలకు కీలకమైన ఈ చెరువు 165 ఎకరాల ఆయకట్టుకు ప్రధాన ఆధారం. ప్రస్తుతం నీటి మట్టం తక్కువగా ఉండటంతో దాన్ని మెరుగుపరచే పనులు చేపట్టారు. జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశాల మేరకు ఉపాధి హామీ కూలీల సహకారంతో పనులు కొనసాగుతున్నాయి. రోజుకు 160--200 మంది కూలీలు ఈ పనుల్లో పాల్గొంటున్నారు. డ్వామా, ఇరిగేషన్ అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు. ఈ పనులు పూర్తయ్యాక సుమారు 165 ఎకరాల సాగుభూమికి నీటి సరఫరా మెరుగుపడనుంది. 300కిపైగా రైతు కుటుంబాలకు నేరుగా లాభం చేకూరగా, 3500 మందికి పైగా ప్రజలు పరోక్షంగా ప్రయోజనం పొందనున్నారు. ప్రధానంగా వరి పంటతో పాటు ఇతర పంటల సాగుకు కూడా ఈ చెరువు కీలకంగా మారనుంది. రాంపురంతో పాటు పినగాడి, పెదగాడి, కరకవానిపాలెం, పెందుర్తి గ్రామాల్లో భూగర్భ జలాల మట్టం పెరుగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. చెరువు పూడిక తీయడం వల్ల బోర్లు, బావుల్లో నీటి నిల్వ పెరుగుతుందని తెలిపారు. రైతు గండి శంకరరావు మాట్లాడుతూ చెరువు పునరుద్ధరణతో సాగు, తాగునీటి అవసరాలు తీరుతాయని పేర్కొన్నారు. సిరికి భవాని అనే రైతురాలు మాట్లాడుతూ పంట పొలాలకు పుష్కలంగా నీరు అంది వ్యవసాయం సులభమవుతుందని తెలిపారు. జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి బుధవారం పనులను పరిశీలించారు. అధికారులతో సమీక్ష నిర్వహించి, నిర్దేశిత గడువులో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సమన్వయంతో పనులు చేపట్టాలని సూచించారు.

## ముమ్మిడివరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రామాయణం మనేశ్వరరావు



**ముమ్మిడివరం సిటిజన్ టైమ్స్ మే 6**

2026 – 2027 సంవత్సరానికి ముమ్మిడివరం బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది రామాయణం మనేశ్వరరావు ఎన్నికయ్యారు. ముమ్మిడివరంలోని కోర్టు ప్రాంగాణంలో బుధవారం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్ష స్థానానికి రామాయణం మనేశ్వరరావు, కుచ్చర్లపాటి రామకృష్ణ రాజు, గోనమండ వెంకటేశ్వరరావు, పోటీ పడ్డారు. మొత్తం 79 ఓట్లు ఉండగా, 70 ఓట్లు పోలయ్యాయి. రామాయణం మనేశ్వరరావుకి 37 ఓట్లు, కుచ్చర్లపాటి రామకృష్ణ రాజుకి 32 ఓట్లు, గోనమండ వెంకటేశ్వరరావుకి 1 ఓటు, వచ్చాయి. 5 ఓట్ల తేడాతో రామాయణం మనేశ్వరరావు గెలుపొంది, అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన వడ్డి నాగేశ్వరావు, కాశి సింహాద్రి వర్యలు ప్రకటించారు.మిగతా కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఏకగ్రీవంగా ఎన్నికయిన వారిలో వైస్ ప్రెసిడెంట్ గా వడ్డీ త్రిమూర్తులు, జనరల్ సెక్రటరీగా పి.వి.వి సత్యనారాయణ మూర్తి, లైబ్రరీ సెక్రెటరీ మాదే యోగేశ్వరి, ట్రెజరర్ గా వెంకట్రావు,జాయింట్ సెక్రటరీగా కాశీ పృథ్వీరాజ్, లేడీస్ రిప్రజెంటేటివ్ గా మట్ట రమ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.నూతనంగా ఎన్నికయిన కార్యవర్గానికి ఏ.జి.పి కాశి సిద్దార్థ కుమార్, ధోనిపాటి ఆంజనేయులు, బీర ప్రసాద్ బాబు,ఆర్.ఎస్.ఎన్ మూర్తి, కె.ఎల్.వి. ప్రసాద్ రావు, పోలిశెట్టి రాజేష్ కుమార్, కాశి జగజీవన్ రావు, మట్టపర్తి వెంకటేశ్వరరావు,ఏ. వలియా బాబా,పలివేల నరేష్,తదితరులు నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## వేటుకూరి సూర్యనారాయణ రాజు కు ఘనసత్కారం

### బిజెపి కిషన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి నాగిరెడ్డి




**రామచంద్రాపురం సిటిజన్ టైమ్స్ మే 6**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన ప్రముఖ సామాజిక కార్యకర్త వేటుకూరి ఏ.వి.ఎస్.సూర్యనారాయణ రాజు అధికారిక కార్యక్రమంలో భాగంగా మొదటిసారిగా కాకినాడ విచ్చేయుచున్న సందర్భంగా గోదావరి కళాక్షేత్రం కాకినాడలో జరిగిన ఆత్మీయ సమావేశంలో పాల్గొని వారిని సత్కరించిన మాజీ సర్పంచ్, కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యదర్శి నాగిరెడ్డి సతీష్ రావు రామచంద్రపురం మండల బిజెపి అధ్యక్షులు ఆకేటి శ్రీ క్రిష్ణ, ప్రధాన కార్యదర్శి పుల్లెల రామమూర్తి. తదుపరి ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్, కాకినాడ ఎంఎల్ఏ వనమాడీ వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, బిజెపి జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు,సివిల్ సప్లై డైరెక్టర్ మాలకొండయ్య తదితరులను ఎమ్మెల్సీ రాజశేఖర్ ఇంట్లో జరిగిన తేనీటి విందులో పాల్గొన్న సతీష్ రావు.

# ఉత్తరాంధ్ర కల సాకారం

### విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు - పి.వి.ఎన్. మాధవ్







**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మే :06**

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ ఉత్తరాంధ్ర ప్రజల దీర్ఘకాలిక ఆకాంక్ష అయిన విశాఖ రైల్వే జోన్ స్థాపనపై స్పందిస్తూ ఇది ప్రాంతీయ అభివృద్ధికి కీలక మలుపుగా పేర్కొన్నారు. రాష్ట్ర విభజన సమయంలో యూపీఏ ప్రభుత్వం రైల్వే జోన్‌ను చట్టబద్ధంగా హామీ ఇవ్వలేదని, కేవలం పరిశీలనకు మాత్రమే పరిమితం చేసిందని ఆయన విమర్శించారు. యువ నాయకుడిగా ఉన్నప్పటి నుంచే విశాఖ రైల్వే జోన్ కోసం పోరాటం కొనసాగించామని, ఆ సందర్భంలో తనపై కేసులు కూడా నమోదు అయ్యాయని మాధవ్ తెలిపారు. పార్లమెంట్‌లో ఈ అంశాన్ని ప్రస్తావించిన ఏకైక పార్టీ బీజేపీనేనని, ఇతర పార్టీలు మద్దతు ఇవ్వలేదని అన్నారు. మాజీ రైల్వే మంత్రి సురేష్ ప్రభు, విశాఖ జోన్‌కు సానుకూలత వ్యక్తం చేశారని, కేంద్ర మాజీ మంత్రి ఎం. వెంకయ్య నాయుడు కృషి కూడా కీలకమైందని చెప్పారు. 2019లో జోన్ ప్రకటించబడటం అనేక సంవత్సరాల పోరాట ఫలితమని గుర్తుచేశారు. అలాగే పీయూష్ గోయల్ "రైల్వే జోన్ ఇవ్వడం తెలంగాణ ఏర్పాటు కంటే క్లిష్టం" అని వ్యాఖ్యానించారని పేర్కొన్నారు. విశాఖలో రైల్వే జోన్ కార్యాలయం కోసం 52.25 ఎకరాల భూమి కేటాయించినట్లు తెలిపారు. భోగాపురం విమానాశ్రయం ప్రారంభం అనంతరం ప్రాంతం కీలక రవాణా కేంద్రంగా మారుతుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో 87 రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, దీని ద్వారా ఉపాధి అవకాశాలు పెరగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. విశాఖ రైల్వే స్టేషన్ దేశంలో స్వచ్ఛమైన స్టేషన్లలో ఒకటిగా గుర్తింపు పొందిందని తెలిపారు. అరకు తర్వాత ఒడిశా ప్రాంతాలు ఉండటంతో రాయగడ డివిజన్‌లో చేర్చిన నిర్ణయం సమంజసమని చెప్పారు. ఇచ్ఛాపురం చేర్చడం వల్ల ఉత్తరాంధ్రకు మరిన్ని ప్రయోజనాలు ఉంటాయని వివరించారు. ఇక రాష్ట్ర రాజకీయాలపై విమర్శలు గుప్పిస్తూ వైసీపీ, వామపక్షాలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. నరసాపురం రైల్వే లైన్ అభివృద్ధి, అమలాపురం మీదుగా రైలు మార్గం, విశాఖ--హైదరాబాద్ నేరుగా లైన్ అవసరమని సూచించారు. దేశ రాజకీయాలపై స్పందిస్తూ మమతా బెనర్జీ, రాహుల్ గాంధీ మాత్రమే బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. పశ్చిమ బెంగాల్‌లో 50 ఏళ్లలో హింసలేని ఎన్నికలు జరిగాయని పేర్కొన్నారు. బీజేపీ ఆవిర్భావం పశ్చిమ బెంగాల్‌లోనే జరిగిందని, శ్యామ ప్రసాద్ ముఖర్జీ కల నేడు నెరవేరిందని అన్నారు. తమిళనాడులో టీవీకేకు స్వాగతం పలుకుతూ, ద్రవిడ రాజకీయాలకు ముగింపు దశ చేరుకుందని వ్యాఖ్యానించారు. ఈ నెల 10 తర్వాత దేశ రాజకీయాల్లో మార్పు కనిపిస్తుందని, త్వరలో తెలంగాణ, కర్ణాటకలో కూడా బీజేపీ అధికారంలోకి వస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ర్యాలీకి ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు.

# రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

### జిల్లా జాయింట్ కలెక్టర్ నిదియాదేవి



**అమలాపురం సిటిజన్ టైమ్స్ మే 6**

ఈనెల 7వ తేదీ నుండి సీసీఎల్ఏ ఆదేశాల మేరకు రెవెన్యూ సమస్యల పరి ష్కారానికి వినూత్న రీతిలో నిర్వహించ నున్న" ఒక నెలలో ఒక గ్రామంలో4 పర్యాయాలు సందర్శన కార్యక్రమం" విజయవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖశీ నిధియాదేవి రెవిన్యూ సిబ్బందికి పిలుపునిచ్చారు. బుధవారం ఆమె ఆర్డీవోలు తాసిల్దార్లు మండల సర్వేలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి రెవెన్యూ సేవలు రీ సర్వే పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ జనగణన గృహ గణన 5 వ విడత రి సర్వే అంశాల పురోగతిపై మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోనసీమ రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నెలలో ఒక గ్రామాన్ని 4 సార్లు సందర్శన అనే అంశం ప్రధానంగా క్షేత్రస్థాయిలో పాలనను ప్రజలకు చేరువ చేయడానికి ఉద్దేశింపబడిం దన్నారు ఈనెల ఏడో తేదీ నుండి మండల పరిధిలో రీ సర్వే పూర్తయిన, రెవెన్యూ సమస్యలు అధికంగా ఉన్న ఒక గ్రామా న్ని ఎంపిక చేసుకుని గ్రామ సభ నిర్వహించి సమస్య లు నమోదు చేస్తూ రెండవ గురువారం క్షేత్రస్థాయి అధికారులతో చర్చించి 3 వ గురువారం కార్యాచరణ రూపొందించి 4 వ గురువారం పూర్తిగా సమస్యలకు పరిష్కార మార్గాలు చూపాలన్నారు. ఒక నెలలో ఒక గ్రామాన్ని 4 సార్లు సందర్శించి రెవెన్యూ సమస్యలను పూర్తిగా పరిష్కరించాల న్నారు. సాధారణంగా గ్రామ సచివాలయాల సందర్శన లేదా రెవెన్యూ సదస్సుల రూపంలో నిర్వహించాలన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రెవెన్యూ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఇందులో భాగంగా ప్రతి మండలంలోని రెవెన్యూ అధికారులు తహాశీల్దార్లు సిబ్బంది నెలకు ఒక గ్రామాన్ని కనీసం నాలుగు సార్లు సందర్శించి, ప్రజలకు అందుబాటులో ఉంటూ రెవెన్యూ సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కార మార్గాలు చూపాలన్నారు. వారానికి ఒకసారి క్షేత్ర పరిశీలన ప్రతి వారం నిర్ణీత రోజున గ్రామాన్ని సందర్శించి భూ సమస్యలు, మ్యుటేషన్లు మరియు ఇతర రెవె న్యూ కుటుంబ సభ్యులు ఆస్తుల పంపిణీ ఆర్ ఓ ఆర్ అంశాలపై విచారణ విచారించి పరిష్కార మార్గాలు సోపాలన్నారు. ఈ వినూత్న కార్యక్రమం ద్వారా రెవెన్యూ సేవలు మరింత పారదర్శకంగా మారుతాయని, ప్రజలు తమ సమస్యల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదని ఆమె అన్నారు. గ్రామ సందర్శన షెడ్యూల్‌ను ముందుగానే ప్రక టించడం ద్వారా ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలనీ ఆమె జిల్లా అభ్యుదయ రైతులకు భూ యజమాన్యాలకు సూచించారు. సమస్యలు ఎక్కువగా ఉన్న గ్రామాలపై ముందుగా దృష్టి పెట్టి నమోదు చేస్తూ పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసుకుని అమలు చేయాలన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారం స్థానికంగా ఉన్న వినతులను స్వీకరించి, వాటిని ఉన్నతాధి కారుల దృష్టికి తీసుకెళ్లి నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించాలన్నారు. ఆర్డీవోలు తాసిల్దార్లు వీఆర్వో లాగిన్ లో గడువు దాటిన సమస్యలు ఉండకుండా ఎప్పటిక ప్పుడు పరిష్కార మార్గాలు చూపాలన్నారు. సాంకేతిక సమస్యలు ఉన్నట్లయితే వాటిని అధిగమించి ఆశించిన పురోగతిని సాధించాలన్నారు. ఐవీఆర్ఎస్ ఫీడ్బ్యాక్ ద్వారా వచ్చిన నెగటివ్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి భవిష్యత్తులో ప్రజా సంతృప్తి స్థాయిలను నూటికి నూరు శాతం మెరుగుపరచాలన్నారు. 5 వ విడత రీ సర్వే క్రమ పద్ధతిలో నిబంధనల మేరకు నిర్వహించాల న్నారు గ్రౌండ్ ట్రూతింగ్ ఈ కేవైసీ,తదితర ప్రక్రియలు సమాంతరంగా నిర్వహించి నిర్దేశిత గడువులోగా సర్వే పూర్తి చేయాలన్నారు కేంద్ర ప్రభుత్వ ప్రాధాన్యత అంశం గా ఉన్న జనగణన లో భాగంగా గృహ గణన సజావుగా నిర్దేశిత సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు ఈ కార్యక్రమంలో డిఆర్ఓ వి. సుబ్బారావు ఆర్డీవోలు జి మమ్మీ పి భాగ్యవతి, తాసిల్దార్లు సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

## 133 కేవీ లైన్ లోపంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం

### మరమ్మత్తు పనులు కొనసాగుతున్నాయి - ఎస్ ఈ రాజేశ్వరీ

అమలాపురం సిటిజన్ టైమ్స్ మే 6 :భీమవరం నుండి రాజోలు సబ్‌స్టేషన్‌కు సరఫరా అయ్యే 133 కేవీ విద్యుత్ లైన్‌లో మలికిపురం మండలం గుడిమెల్లంక గ్రామం సమీపంలో కండక్టర్ లోపం ఏర్పడినట్లు గమనించినట్లు ఏపీ ఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ రాజేశ్వరీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లోపాన్ని గుర్తించిన వెంటనే ఏపీ ట్రాన్స్‌కో సిబ్బంది మరమ్మత్తు పనులు ప్రారంభించారని, ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కారణంగా పరిసర ప్రాంతాల్లో అప్పుడప్పుడు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగవచ్చునని, వినియోగదారులు సహకరించాలని కోరారు. మరమ్మత్తు పనులు పూర్తయిన వెంటనే విద్యుత్ సరఫరాను సాధారణ స్థితికి తీసుకురాబడుతుందని తెలిపారు.

## బీసీల సంక్షేమమే తెలుగుదేశం పార్టీతోనే సాధ్యం

### యాదవ కమ్యూనిటీ ఆత్మీయ సమావేశంలో శాసనసభ్యులు వనమాడి



**కాకినాడ (సిటిజన్ టైమ్స్)మే 6:**

బీసీల సంక్షేమమే తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని, తెలుగుదేశం పార్టీకి బీసీలు వెన్నుముకని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు. బుధవారం స్థానిక స్మార్ట్ సిటీ కార్యాలయం నందు యాదవ కమ్యూనిటీ నాయకులతో కొండబాబు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లేబర్ బోర్డ్ కార్పొరేషన్ డైరెక్టర్గా నియమితులైన గదులు సాయిబాబా ను కొండబాబు సత్కరించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ బీసీల సంక్షేమం కొరకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని, తెలుగుదేశం పార్టీకి బీసీలు ఎల్లప్పుడూ వెన్నుముకల నిలవడం జరిగిందని, యాదవ కమ్యూనిటీ అభివృద్ధి కొరకు కూటమి ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవడం జరుగుతుందని, నేడు తెలుగుదేశం పార్టీకి సేవలు అందించిన యాదవ కమ్యూనిటీకు చెందిన గదులు సాయిబాబాను లేబర్ బోర్డు కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమించడం జరిగిందని కొండబాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, యాదవ కమ్యూనిటీ నాయకులు పిర్ల లక్ష్మీ ప్రసన్న రాంబాబు, మన్నే నాగేశ్వరరావు, నురగలు బాబురావు, ఏసుబాబు, బాలకృష్ణ, సుబ్బు శ్రీను, చిట్టిమేని సత్యనారాయణ, బాదం అజయ్, కూరాకుల రామకృష్ణ, సత్తిబాబు, లవకుశ, తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్ తప్పనిసరి... నిర్లక్ష్యంపై అధికారులు కఠిన హెచ్చరిక

### ఎస్పీ కె.వి. మహేశ్వర్ రెడ్డి







**శ్రీకాకుళం, సిటిజన్ టైమ్స్, మే :06**

శ్రీకాకుళం జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో హెల్మెట్ వినియోగంపై ప్రజల్లో చైతన్యం పెంచేందుకు టెక్కలిలో "అభయం హెల్మెట్ బ్యాంక్" పేరుతో ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు. జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమాన్ని ఆర్డీవో కృష్ణమూర్తి, డీఎస్పీ డి. లక్ష్మణరావు నేతృత్వంలో చేపట్టారు. డిగ్రీ కాలేజీ నుంచి ఇంద్ర చౌక్ వరకు సాగిన ర్యాలీలో రోడ్డు భద్రత, హెల్మెట్ ప్రాముఖ్యతపై విస్తృతంగా అవగాహన కల్పించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారికి తాత్కాలికంగా హెల్మెట్లు అందజేస్తూ, 48 గంటల్లోపు తిరిగి ఇచ్చే సమయంలో కొత్త హెల్మెట్ కొనుగోలు చేయాలని ప్రోత్సహించారు. ఆర్డీవో కృష్ణమూర్తి మాట్లాడుతూ, జిల్లాలో రోడ్డు ప్రమాదాలను 20% వరకు తగ్గించడంలో పోలీసులు విజయవంతమయ్యారని తెలిపారు. హెల్మెట్ ధరించకపోతే రూ.1035 జరిమానా విధిస్తున్నామని హెచ్చరించారు. అయినప్పటికీ కొంతమంది నిర్లక్ష్యం చూపడం ఆందోళనకరమన్నారు. డీఎస్పీ లక్ష్మణరావు మాట్లాడుతూ, గత కొన్నేళ్ల గణాంకాల ప్రకారం హెల్మెట్ లేకపోవడమే మోటార్ సైకిల్ ప్రమాదాల్లో ప్రాణనష్టానికి ప్రధాన కారణమని పేర్కొన్నారు. నరసన్నపేటలో కూడా ఈ హెల్మెట్ బ్యాంక్ సేవలను విస్తరించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, ఆర్టీసీ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# వాహనాల రద్దీ నియంత్రణకు సాంకేతిక సిగ్నల్ వ్యవస్థ

## ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాలకు చెక్ - ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి

## శ్రీపూర్ రోడ్ చౌరస్తాలో నూతన సిగ్నల్ వ్యవస్థ ప్రారంభం





**సిటిజన్ టైమ్స్ నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి మే 6**

రోడ్డు ప్రమాదాలను తగ్గించాలంటే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎమ్మెల్యే డా. కుచుకుళ్ల రాజేష్ రెడ్డి సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని శ్రీపూర్ రోడ్ చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, జిల్లా కేంద్రంలో వాహనాల రద్దీ రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణకు సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో ఈ సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేశామని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ఇది దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం, హెల్మెట్ మరియు సీట్‌బెల్ట్ వినియోగం చేయకపోవడం వల్ల ప్రమాదాలు అధికమవుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించడం ద్వారా ప్రాణాలను రక్షించుకోవచ్చని పేర్కొన్నారు. ప్రజల భద్రత ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, ట్రాఫిక్ నియంత్రణ కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యంగా యువత జాగ్రత్తగా వాహనాలు నడపాలని, ఇతరుల ప్రాణాలను గౌరవించాలని సూచించారు. ట్రాఫిక్ పోలీసులు ఇచ్చే సూచనలను పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్ఐ కె గోవర్ధన్ , నాగర్ కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సురేంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు, మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, ట్రాఫిక్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ నూతన భవనం ప్రారంభించిన జిల్లా ఎస్పీ రాహుల్ మీనా

### ముఖ్యఅతిథిగా కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు




**రావులపాలెం సిటిజన్ టైమ్స్ మే: 6**

రావులపాలెం అర్బన్ పోలీస్ స్టేషన్ నూతన భవనాన్ని ప్రారంభించి తదుపరి అర్బన్ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం పట్టణంలో నూతనంగా నిర్మించిన అర్బన్ పోలీస్ స్టేషన్ నందు నూతన భవనాన్ని జిల్లా పోలీస్ పర్యవేక్షకులు (ఎస్పీ) రాహుల్ మీనా ఐపీఎస్ ఈరోజు ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ స్థానిక ఎమ్మెల్యే తో కలిసి అర్బన్ పోలీస్ స్టేషన్ నందు నూతన భవనం ఎస్.హెచ్.ఓ కార్యాలయాన్ని ప్రత్యేకంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి, శాంతి భద్రతల పరిరక్షణకు నూతన భవన వసతులు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. ఎమ్మెల్యే బండారు సత్యానందం మాట్లాడుతూ పోలీస్ శాఖ ఆధునీకరణలో భాగంగా అత్యాధునిక వసతులతో భవనాన్ని నిర్మించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రావులపాలెం అర్బన్ పోలీస్ స్టేషన్ కార్యాలయ పరిసరాలను క్షుణ్ణంగా తనిఖీ చేసిన ఎస్పీ స్టేషన్ ప్రాంగణం పరిశుభ్రంగా ఉండాలని, ప్రజలు ఫిర్యాదులు ఇవ్వడానికి వచ్చినప్పుడు వారికి స్నేహపూర్వక వాతావరణం కల్పించాలని సూచించారు. ఎస్పీ రావులపాలెం అర్బన్ పోలీస్ స్టేషన్ కార్యాలయ రికార్డులను పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిపై అధికారులతో చర్చించారు. కేసుల దర్యాప్తులో వేగం పెంచి బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని ఆదేశించారు. రావులపాలెం అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోర్టల్ ద్వారా రికవరీ చేసిన మొబైల్ ఫోన్లను ఎస్పీ ఈ సందర్భంగా బాధితులకు అందజేసినారు. రావులపాలెం అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న లైవ్ ఇష్యూస్ ను ఇతర డిపార్ట్మెంట్లతో కలుపుకుని, శాంతి కమిటీనల ను ఏర్పాటు చేసుకుని ఇరు వర్గాల ప్రజలతో చర్చించుకుని సమస్యను పరిష్కరించాలని సూచించినారు. రావులపాలెం అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బ్లాక్ స్పాట్లను గుర్తించి వాటిని ఇతర డిపార్ట్మెంట్ల తో కలిపి పరిశీలించి ఆ ప్రదేశంలో కావలసిన లైట్స్ ,రేడియం స్టిక్కరింగ్, స్పీడును నియంత్రించే అవరోధాలను ఏర్పాటుచేసి రోడ్ యాక్సిడెంట్ తగ్గించడానికి కృషి చేయాల్సిందిగా సూచించినారు. రావులపాలెం అర్బన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ,ఎస్ఐలు ఇతర సిబ్బందితో ఎస్పీ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. విధి నిర్వహణలో ఎదురవుతున్న సవాళు ,,శాంతిభద్రతల పరిరక్షణ ,ప్రజలకు అందుబాటులో ఉండటంపై దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట సుంకర మురళీమోహన్ ,ఎస్.బి. సీఐ పుల్లారావు, రావులపాలెం అర్బన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎం. శేఖర్ బాబు ,రావులపాలెం సర్కిల్ ఇన్స్పెక్టర్ సిహెచ్. విద్యాసాగర్ వివిధ విభాగాలకు చెందిన ఎస్సైలు, స్టేషన్ సిబ్బంది ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# వ్యవసాయ కార్మిక సంఘం మహాసభల జాతను ప్రారంభించిన లోకనాదం

**అమలాపురం సిటిజన్ టైమ్స్ మే 06**

వ్యవసాయ కార్మిక సంఘం 30వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు లోకనాదం అన్నారు. బుధవారం అమలాపురం యూటీఎఫ్ హోమ్ వద్ద జండా ఊపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభల ప్రచార జాతాను ప్రారంభించారు. ఈ సందర్భంగా లోకనాదం మాట్లాడుతూ మే 11,12,13 తేదీలలో మూడు రోజులు పాటు అమలాపురం స్థానిక గడియార స్తంభం సెంటర్ గంగరాజు ఫంక్షన్ హాల్ లో 30వ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వ్యవసాయ కార్మికుల ఐక్యతను బలోపేతం చేయడం, వారి హక్కులను సాధించడం లక్ష్యంగా రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం మహాసభలు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో నిర్వహించనున్నట్లు అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు సిఐటియు జిల్లా అధ్యక్షులు దుర్గాప్రసాద్, బలరాం మాట్లాడుతూ ఈ మహాసభలు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి వేలాది మంది వ్యవసాయ కార్మికుల హాజరవుతారని అ కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలైన కనీస



వేతనాలు, సంవత్సరమంతా ఉపాధి కల్పించడం,గృహాలు, పింఛన్లు వంటి వ్యవసాయ కార్మికుల సంక్షేమంపై పెద్ద ఎత్తున పోరాటాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

## రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ నిర్వహించాలి

## రైతుల ఖాతాల్లో చెల్లింపులు త్వరితగతిన జమ చేయాలి

## ఎంపీ డాక్టర్ మల్లు రవి,జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి




**నాగర్ కర్నూల్ జిల్లా సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 6**

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని నెల్లికొండి మార్కెట్ యార్డ్‌లో వరి, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను బుధవారం సాయంత్రం నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి లు కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మార్కెట్ యార్డ్‌లో కొనసాగుతున్న మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను దగ్గరగా పరిశీలించి, రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలు, గన్ని బ్యాగుల సేకరణ, తూకం తదితర అంశాలపై రైతులు, అధికారులతో ఆరా తీశారు. తిమ్మసానిపల్లి గ్రామానికి చెందిన రైతులు రాముతో ఎంపీ ప్రత్యక్షంగా ఫోన్లో మాట్లాడి రైతు తన పొలంలో ఇంత మొక్కజొన్న పంట పండించారు ఎంత దిగుబడి వచ్చింది కొనుగోలు ప్రక్రియ ఎలా జరిగింది అనే అంశంపై రైతుతో ప్రత్యక్షంగా ఆరా తీశారు. ధాన్యం తూకం, తేమ శాతం కొలతలు, రికార్డు నమోదు విధానం వంటి అంశాలను సవివరంగా పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎటువంటి అవకతవకలు చోటుచేసుకోకుండా పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని మార్క్ ఫెడ్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ..., రైతులకు రైతు ప్రజా ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర (మీప్రా) పూర్తి స్థాయిలో అందేలా చర్యలు తీసుకోవడం అత్యంత ముఖ్యమని ఆయన తెలిపారు. రైతులు తమ పంటను మార్కెట్ యార్డ్‌కు తీసుకువచ్చిన వెంటనే టోకెన్ల ఆధారంగా నమోదు చేసి, ఆలస్యం లేకుండా కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు అనవసరమైన వేచిచూపులు లేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని ఎంపీ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుండి ప్రతి గింజ కొనుగోలు చేస్తుందని రైతులు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎంపీ సందర్భంగా కోరారు. అదేవిధంగా, కొనుగోలు అనంతరం రైతుల బ్యాంక్ ఖాతాల్లో చెల్లింపులు త్వరితగతిన జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ..... మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా చేసేందుకు జిల్లా యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ వెల్లడించారు. గన్ని సంచుల కొరతను తీర్చే విధంగా నేరుగా రైతుల నుండే గన్ని సంచులు తీసుకొని గని సంచులకు అవసరమైన రేటు నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. మార్కెట్ యార్డ్ పరిధిలో త్రాగునీరు, నీడ, విశ్రాంతి కోసం షెడ్లు, నిల్వ గోదాములు, రవాణా సౌకర్యాలు వంటి మౌలిక వసతులను మరింత మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియలు చేపట్టాల్సిన అంశాలను కలెక్టర్ అధికారులను స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తిగా సిద్ధంగా ఉన్నాయని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తేమ శాతం, నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ కొనుగోళ్లు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సందర్శనలో రైతులు తమ సమస్యలను తెలియజేస్తూ తక్షణ పరిష్కారం కోరగా, సంబంధిత అధికారులు వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని కలెక్టర్ రైతులకు హామీ ఇచ్చారు. రైతులకు ఎలాంటి సమస్యలు వచ్చినా తన దృష్టికి నేరుగా తీసుకురావాలని ఎల్లవేళలా అందుబాటులో ఉంటాను కలెక్టర్ ఈ సందర్భంగా రైతులకు తెలిపారు. నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ.... కొనుగోలు ప్రక్రియలో మధ్యవర్తుల జోక్యం లేకుండా పూర్తిగా పారదర్శక విధానంలో వ్యవహరించాలని అధికారులకు ఆయన స్పష్టం చేశారు. రైతులకు అనుకూల వాతావరణంలో, వేగవంతమైన, నిష్పాక్షికమైన కొనుగోలు ప్రక్రియను అమలు చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఆ విధంగానే క్షేత్రస్థాయి లో అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రజా ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందని, రైతులకు నష్టం కలిగించే ఏ విషయంపై ఉపేక్షించమని అధికారులకు ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియలు నిర్వహించాలని ఆయన కోరారు. రైతులు పలు సమస్యలను తీసుకురాగా వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అవసరమైతే సిబ్బందిని పెంచుకొని రైతుల సమస్యలను పరిష్కరించాలని వారు అధికారులకు ఆదేశించారు. వారి వెంట మార్క్ ఫెడ్, పౌరసరఫరాలు, మార్కెటింగ్ శాఖల అధికారులు, రైతులు, తదితరులు ఉన్నారు.

## ప్లాస్మా టెక్నాలజీ యూనిట్ కలెక్టర్ ఆధ్వర్యంలో ట్రైలర్ రన్

### చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం




**అమలాపురం సిటిజన్ టైమ్స్ మే 6**

ప్లాస్మా టెక్నాలజీ ద్వారా తడి,పొడి చెత్త ను హానికరమైన వ్యర్థాలను బూడిదగా మార్చడం ఆధునిక,పర్యావరణహితమైన వ్యర్థాల నిర్వహణ పద్ధతని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక డంపింగ్ యార్డ్ వద్ద నిర్మించిన ప్లాస్మా టెక్నాలజీతో వ్యర్థాల నిర్వహణ కొరకు ప్లాస్మా టెక్నాలజీతో ఏర్పాటు చేసిన యూనిట్ కి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ట్రైన్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ ?సాధారణంగా పదార్థాలు ఘన, ద్రవ, వాయు రూపాల్లో ఉం టాయని. ప్లాస్మా అనేది నాలుగో రూపం అత్యధిక ఉష్ణోగ్రత వద్ద వాయువును మండించి నప్పుడు అది ప్లాస్మాగా మారుతుందన్నారు. సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ ద్వారా హానికరమైన వ్యర్థాలు మిక్స్ డ్రైవ్ వేస్ట్ ప్రాసెసింగ్ చేసేందుకు వీలుగా రోజువారి 10 మెట్రిక్ టన్నులు ప్రాసెసింగ్ చేసే యూనిట్ను నెలకొల్పడం జరిగిందన్నారు. దీనికి ఎటువంటి గ్యాస్ కరెంటు అవసరం లేదని లోపల మిషనరీ పని చేయడానికి బర్నింగ్ కు మాత్రమే కరెంటు అవసరమన్నారు. బర్నింగు ప్లాస్మా టార్చ్ లను ఉపయోగించి దాదాపు ఉష్ణోగ్రతను సృష్టిస్తారన్నారు. బర్నింగ్ చాంబర్ క్లాస్మేట్ టెక్నాలజీ ద్వారా గాలిలో స్వచ్ఛమైన ఆక్సిజన్ ను లోపలికి పంపిస్తూ 850-1500 డిగ్రీల సెంటిగ్రేడ్ టెంపరేచర్ తో 95 శాతం వేస్ట్ బర్నింగ్ అవుతుందని 5 శాతం మాత్రమే బూడిద వస్తుం దన్నారు. బూడిద ద్వారా గ్యాస్ వస్తుందని ఫ్లూ గ్యాస్ నాలుగు రకాలుగా ఉంటుందన్నారు .గ్యాస్ దుమ్ము ధూళి 20 మైక్రాన్లు వేస్టను కిందకు నెడు తుందన్నారు. దీనిలో 195 బ్యాగులు ఉంటాయని వీటి ద్వారా 5 శాతం మైక్రాల డస్ట్ కలెక్ట్ అవుతుందన్నారు. నాలుగు దశలలో ప్యూర్ ఎయిర్ బయటకు వస్తుందన్నారు. ఈ ప్లాంట్ నందు 150 కెవిఏ ట్రాన్స్ఫా ర్మర్ను ఏర్పాటు చేయడం జరిగిందని ప్లాంట్ అవసరాలకు 120 కె.వి.ఏ కెపాసిటీ సరిపోతుంద న్నారు ఆక్సిజన్ వచ్చి ఈ విపరీతమైన వేడి వల్ల చెత్తలోని అణువులు విచ్ఛిన్నమవుతాయన్నారు. తడి చెత్త, పొడి చెత్త, ప్లాస్టిక్ లేదా మెడికల్ వేస్ట్ నేరుగా వాయువులుగా, చిన్నపాటి బూడిదగా మారి పోతుందన్నారు?. ఈ టెక్నా లజీ వల్ల ?చెత్త కుప్పలు ఉండవనీ పెద్ద ఎత్తున భూమిని ఆక్రమించే డంపింగ్ యార్డ్ ల అవసరం ఉండదన్నారు. సాధారణంగా చెత్తను తగలబెడితే విషవా యువులు వస్తాయని కానీ ప్లాస్మా పద్ధతి లో గాలి తక్కువగా ఉండటం వల్ల హానికరమైన పొగ రాద న్నారు. తడి, పొడి చెత్తతో పాటు ప్రమాదకరమైన బయో- మెడికల్ వేస్ట్‌ను కూడా ఇది సురక్షితంగా నాశనం చేస్తుందన్నారు. దీనిని నడపడానికి నిపుణులైన సిబ్బంది అవసరమని ?మన దేశంలో కొన్ని ప్రధాన నగరాల్లో, మున్సి పాలిటీల్లో పైలట్ ప్రాజెక్టులుగా దీనిని ప్రయోగిస్తున్నారు. చెత్త సమస్యకు ఇది ఒక శాశ్వత పరిష్కారంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సి పల్ కమిషనర్ వి నిర్మల్ కుమార్, తాసిల్దార్ వి దివాకర్, మున్సిపల్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

## కమిషన్ చైర్మన్గా బాధ్యతలు స్వీకరించిన వేటుకూరి సూర్యనారాయణ రాజు

**కాకినాడ సిటిజన్ టైమ్స్ మే 6**

కాకినాడ గోదావరి కళాక్షేత్రంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ గా వేటుకూరి సూర్యనారాయణ రాజు పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర వైద్య ఆరోగ్య ,కుటుంబ సంక్షేమం వైద్య విద్యా శాఖ మంత్రి వై సత్య కుమార్ పాల్గొన్నారు .ఈ కార్యక్రమంలో కూటమి ఎమ్మెల్యే,ఎమ్మెల్సీ బిజెపి, జనసేన కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొనడం జరిగింది.





# ప్రసూతి వైద్య సేవలపై..

### గాయత్రి ఆస్పత్రి వారి రాయితీ

### రూ.10వేలకే ప్రసూతి వైద్య సేవలు డాక్టర్ గాయత్రి

**గిద్దలూరు, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 6**



గిద్దలూరు పట్టణంలో పది రూపాయల డాక్టర్ గా వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ బ్రహ్మానందరెడ్డి స్థాపించిన గాయత్రి ఆస్పత్రిలో మహిళలకు ప్రసూతి వైద్య సేవలు రాయితీపై అందిస్తున్నట్లు ఆస్పత్రి వర్గాలు ప్రకటించాయి. సీనియర్ గైనకాలజిస్ట్, లాపరోస్కోపిక్ శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ గాయత్రి పర్యవేక్షణలో రాయితీ వైద్యం లభిస్తుంది. సాధారణ కాన్పులు, సిజేరియన్ ఆపరేషన్లు, లాపరోస్కోపిక్ ట్యూబెక్టమీ ఆపరేషన్లు ఈ రాయితీ సేవల్లో ఉన్నాయి. ఆపరేషన్, రూమ్ రెంట్ మరియు మందుల ఖర్చులతో కలిపి కేవలం రూ.10 వేలకే సేవలందించనున్నట్లు పేర్కొన్నారు. గిద్దలూరు నియోజకవర్గ పరిధిలోని మారుమూల పట్టణ, గ్రామీణ గర్భిణీ స్త్రీలు సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ గాయత్రి కోరారు. డాక్టర్ బ్రహానందరెడ్డి రూ 10 ల డాక్టరుగా పేరుగడించి, గ్రామీణప్రాంతలో ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారు. వైద్య శిబిరాల్లో ఉచితంగా మందులు కూడా అందిస్తారు. మానవసేవే మాధవ సేవ అనే నమ్మకంతో ముందుకు సాగుతున్నారు. రాయితీ సేవలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ కోరారు.

# ఢిల్లీలో బీజేపీ నాయకులు

### హరిశరన్ దేవగన్‌ను కలసిన గిద్దలూరు బిజెపి నాయకుడు అప్పిశెట్టి ఉదయ్ శంకర్



**గిద్దలూరు, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 6**

భారతీయ జనతా పార్టీ గిద్దలూరు బిజెపి నాయకుడు అప్పిశెట్టి ఉదయ్ శంకర్ ఢిల్లీ లో బీజేపీ ప్రముఖ నాయకులు హరిశరణ్ దేవగన్‌ను ఆయన కార్యాలయం లో మర్యాద పూర్వకంగా కలసి గిద్దలూరు నియోజక వర్గంలో ఎన్ డి ఏ ప్రభుత్వం ప్రజల కు అందిస్తున్న పథకాలను, బీజేపీ పార్టీ విస్తరణ,పార్టీ లో ఇతర పార్టీల నేతల చేరికలు బూత్ కమిటీ లు నియామకం శక్తి కేంద్రాల నియామకం,రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల గురించి ఇటీవల దేశము లో జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికలలో బీజేపీ బెంగాల్,అస్సాం,పుదుచ్చేరి రాష్ట్రాల లో ఘన విజయం గురించి చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా హరిశరన్ దేవగన్ గిద్దలూరు అసెంబ్లీ కి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను త్వరి తగతిన శాంక్షన్ చేయడం లో తన సహకారము ఉంటుంది అని తెలియ చేశారు.ఎప్పుడూ అవసరం ఉన్న తనను కలవండి అని తెలియ చేశారు.

# నిరుద్యోగులకు ఏపీ బి.సి. స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ,

**గిద్దలూరు, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 6**



ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని నిరుద్యోగ యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ బి.సి. సంక్షేమ శాఖ కీలక నిర్ణయం తీసుకుందని, ఒంగోలులోని ఏపీ బి.సి. స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఆర్ఆర్ బి, అసిస్టెంట్ లోకో పైలట్ , ఆర్ఆర్ బి గ్రూప్-డి , ఏపీ హైకోర్టు ఉద్యోగాల కోసం ఉచిత శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు గిద్దలూరు బి.సి. సహాయ సంక్షేమాధికారి దమ్మాల హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. గిద్దలూరు ప్రాంత పరిధిలోని అర్హులైన బీసీ, ఎస్సి, ఎస్టీ అభ్యర్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవచ్చని, అలాగే నమోదు చేసుకున్న వారిలో ఎంపిక చేసిన 100 మంది అభ్యర్థులకు 2 నెలలు ఉచిత శిక్షణతో పాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ అందించబడుతుందని, ఎంపికైన వారికి ఈ నెల 25వ తేదీ నుండి తరగతులు ప్రారంభమవుతాయని, అభ్యర్థులు తమ బయోడేటాతో పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ సర్టిఫికేట్ల నకళ్లు, కుల , ఆదాయ ధ్రువీకరణ పత్రాలు (తల్లిదండ్రుల వార్షికాదాయం రూ. లక్ష లోపు ఉండాలి), ఆధార్ కార్డు నకలు, బ్యాంక్ పాస్ బుక్ నకలు, ఆర్ఆర్ బి గ్రూప్-డి, ఏపీ హైకోర్టు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న ఆన్ లైన్ అప్లికేషన్ కాపీలు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో ఈ నెల 20వ తేదీ లోపు ఒంగోలు జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదురుగా ఉన్న గవర్నమెంట్ ఆఫీస్ కాంప్లెక్స్‌లోని ఏపీ బిసి స్టడీ సర్కిల్ కార్యాలయంలో సమర్పించాలని హరి ప్రసాద్ కోరారు. కావున ఈ అవకాశాన్ని గిద్దలూరు ప్రాంత నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు సెల్ 9849655379 నంబరును సంప్రదించాలని కోరారు.

# పట్టభద్రుల కలలకు పట్టం కట్టిన ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల

## -ఘనంగా తొలి గ్రాడ్యుయేషన్ డే వేడుకలు





**కందుకూరు, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 6**

ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలలో (అటోనమస్) తొలి గ్రాడ్యుయేషన్ డే వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. విద్యార్థుల జీవితంలో చిరస్మరణీయ ఘట్టంగా నిలిచిన ఈ వేడుకలో పీజీ పట్టభద్రులకు డిగ్రీ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. గ్రాడ్యుయేషన్ గౌన్లలో మెరిసిపోయిన విద్యార్థులు ఆనందోత్సాహాల మధ్య కళాశాల ఆవరణలో సందడి చేశారు.కార్యక్రమానికి కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కె. విజయ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై పట్టభద్రులకు డిగ్రీ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య అనేది ఉద్యోగానికి మాత్రమే కాదు వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే శక్తి అని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాలలో అత్యాధునిక ల్యాబ్‌లు, డిజిటల్ క్లాస్‌రూమ్స్, ఇండస్ట్రీ ఓరియెంటెడ్ ట్రైనింగ్, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, మెరుగైన ప్లేస్‌మెంట్ అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. యువత సాంకేతిక పరిజ్ఞానంతో పాటు నైతిక విలువలను కూడా అలవరచుకొని సమాజానికి ఉపయోగపడే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కళాశాల వ్యవస్థాపకులు డాక్టర్ కె. రామయ్య ఆశయాలను స్మరించుకుంటూ ఈ తొలి గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఆయనకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించగా సభలో భావోద్వేగ వాతావరణం నెలకొంది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. హెచ్. రవి కుమార్ పట్టభద్రులతో గ్రాడ్యుయేషన్ ప్రతిజ్ఞ చేయించారు. సమాజ శ్రేయస్సు కోసం మా విద్యను వినియోగిస్తాం అంటూ విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమం మొత్తం అత్యంత క్రమబద్ధంగా, హుందాగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వి. హరిబాబు, పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ షేక్ దస్తగిరి, వివిధ విభాగాల హెచ్‌వోడీలు, అధ్యాపకులు పాల్గొని పట్టభద్రులను అభినందించారు. అన్ని విభాగాల సిబ్బంది సమిష్టి కృషితో వేడుక విజయవంతమైంది. అనంతరం కళాశాల యాజమాన్యం ఏర్పాటు చేసిన విందు భోజనం అందరినీ ఆకట్టుకుంది. తల్లిదండ్రులతో కలిసి విద్యార్థులు ఫోటోలు దిగుతూ జీవితాంతం గుర్తుండిపోయే మధుర క్షణాలను ఆస్వాదించారు. కళాశాల ప్రాంగణం మొత్తం ఆనందోత్సాహాలతో కళకళలాడింది.

# రైతుల సమస్యల పరిష్కారమే రాష్ట్ర ప్రభుత్వ ఆశయం



**కొమరోలు, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 6**

రైతులు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వన్ మంత్ ,వన్ విలేజ్, ఫోర్ విజిట్ అనే కార్యక్రమాన్ని అమలు చేస్తున్నదని కొమరోలు తాసిల్దార్ భాగ్యలక్ష్మి తెలిపారు. బుధవారం కొమరోలు తాసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తాసిల్దార్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, రెవెన్యూ సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు ప్రభుత్వము విడుదల చేసిన మార్గదర్శకాలను మండలంలో అమలు జరుపుతున్నట్లుగా ఆమె చెప్పారు. వన్ మంత్, వన్ విలేజ్, ఫోర్ విజిట్స్ కార్యక్రమాలను మండలంలో సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లుగా ఆమె చెప్పారు. మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకొని ఆ గ్రామంలో వరుసగా నాలుగు వారాలపాటు నాలుగు విడతలుగా ప్రత్యేక రెవెన్యూ గ్రామ సందర్శనలు నిర్వహించబడతాయని, గ్రామస్తుల భూ, రెవెన్యూ సంబంధిత సమస్యలను గ్రామంలోనే అర్జీలు రూపంలో స్వీకరించి, పరిశీలించి, చట్టబద్ధంగా పరిష్కరించడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని ఆమె పేర్కొన్నారు. రీ సర్వే గ్రామాలు ,ఎక్కువ సంఖ్యలో రెవెన్యూ ఫిర్యాదులు ఎక్కువగా పెండింగ్లో ఉన్న గ్రామాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లుగా ఆమె చెప్పారు. సదరు కార్యక్రమంలో తాసిల్దార్, ఎంపీడీవో, మండల సర్వేయర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ తదితర అధికారులు తప్పనిసరిగా పాల్గొని రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని అన్నారు. సదరు కార్యక్రమాలలో భాగంగా మొదటి సందర్శనలో ఫిర్యాదుల స్వీకరణ, గ్రామ భూ రికార్డుల పరిశీలన, రెండవ సందర్శనలో ఫీల్డ్ వెరిఫికేషన్ ,విచారణ, మూడవ సందర్శనలో సమస్యల పరిష్కారం, ఉత్తర్వులు జారీ ,నాలుగవ సందర్శనలో గ్రామసభ నిర్వహించి, పరిష్కరించిన సమస్యలు వివరాలు ప్రజా ప్రకటన చేపడతామని ఆమె తెలిపారు. సదరు కార్యక్రమాలు గురువారం నుంచి మండలంలో సూరి వారి పల్లి గ్రామం నుంచి ప్రారంభమవుకానున్నాయని, కావున రైతులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సమస్యల పరిష్కారానికి రెవెన్యూ అధికారులకు సహకరించాలని ఆమె కోరారు.

# ఏ పి టి ఎఫ్ నూతన జిల్లా కార్యవర్గం ఎన్నిక

**గిద్దలూరు, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 6**



స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మార్కాపురం జిల్లా ఏ పీ టీ ఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులు రాచేటి సంజీవ్ కుమార్ అధ్యక్షతన , రాష్ట్ర కార్యదర్శి కే వి జి కీర్తి ఎన్నికల అధికారిగా ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి హృదయ రాజు పర్యవేక్షణలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు . ముఖ్య అతిథి హృదయ రాజు మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న నాలుగు విడతల డి ఏ లను విడుదల చేస్తూ నూతన పిఆర్సి కమిటీని ఏర్పాటు చేయాలని వెంటనే 30శాతం ఐ ఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు . రాష్ట్ర కార్యదర్శి శ్రీ కే.వీ.జీ. కీర్తి మాట్లాడుతూ ఉద్యోగుల పట్ల ఉపాధ్యాయుల పట్ల ఉదాసీన వైఖరి విడనాడకపోతే మరో బి ఆర్ టి ఎస్ ఉద్యమాన్ని చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. జిల్లా గౌరవ అధ్యక్షులు ఎన్నికైన ఎస్ ఎచ్ కబీర్ మాట్లాడుతూ విద్యారంగాన్ని పరిరక్షించాలని ఉపాధ్యాయులపై ఏ పి పి ల భారాన్ని తగ్గించి బోధనపై దృష్టి సారించి, అనవసరపు పని ఒత్తిడిని తగ్గించాలని సూచించారు. జిల్లా అధ్యక్షులు ఆర్ సంజీవ్ కుమార్ మాట్లాడుతూ సిపిఎస్ రద్దు గురించి సరైన నిర్ణయాన్ని తక్షణం తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన టి పాండురంగ స్వామి మాట్లాడుతూ కారుణ్య నియమకాలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు వై శ్రీనివాసులు మాట్లాడుతూ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ఒక పూర్తి రోజు నిర్వహించేలా ,ఆప్షనల్ హాలిడేస్ ను మొత్తంగా వినియోగించుకునేలా ఉత్తర్వులు విడుదల చేయాలని కోరారు. జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో నెంబర్ 57 ను అమలు చేసి సుమారుగా పదివేల మంది 2002, 2003 డిఎస్సి ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని వక్తలు డిమాండ్ చేశారు ఏ ఐ ఎఫ్ ఆర్ టి ఈ రాష్ట్ర కౌన్సిలర్ సి పి వి సుబ్బారావు మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమం కూడా ప్రభుత్వ బాధ్యత అని గవర్నమెంట్ పాఠశాలను బలోపేతం చేయడానికి నూతన మార్గాలు అన్వేషించాలని సూచించారు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఆర్ సంజీవ్ కుమార్ , ప్రధాన కార్యదర్శిగా టి పాండురంగ స్వామి గౌరవ అధ్యక్షులుగా ఎస్ హెచ్ కబీర్ , అసోసియేట్ ప్రెసిడెంట్ గా ఉపాధ్యక్షులుగా ఎస్. సి. కుమార్, ఎస్. వి. సుభాషిని డిజె ప్రభాకర్, 1. అడిషనల్ సెక్రటరీగా ఎస్కే మహమ్మద్ రఫీ, కార్యదర్శులుగా ఎన్. ఏలియా, డి రూపుల్ నాయక్, డి. వెంకటేశ్వర్లు, జి. పాండు, ఎం. కృష్ణమూర్తి ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# కసినేపల్లె గ్రామంలో బండలాగుడు పందెం పోటీలను ప్రారంభించిన గిద్దలూరు ఎమ్మెల్యే తనయుడు ముత్తుముల దివ్యేష్ రెడ్డి





**కొమరోలు, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 6**

కొమరోలు మండలం కసినేపల్లె గ్రామంలో బుధవారం ఏర్పాటుచేసిన రాష్ట్రస్థాయి బండలాగుడు పందెం పోటీలను గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి తనయుడు ముత్తుముల దివ్యేష్ రెడ్డి లాంచనంగా ప్రారంభించారు. కసినేపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమాలు 4వ తేదీ నుంచి ఆరవ తేదీ వరకు ఘనంగా నిర్వహించారు. ఆ సందర్భాన్ని పురస్కరించుకొని ఆ బుధవారం ఆ గ్రామంలో రాష్ట్రస్థాయి బండలాగుడు పందెం పోటీలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు .ఆ కార్యక్రమాలకు గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డిని ఆహ్వానించగా కొన్ని కారణాలవల్ల శాసనసభ్యులు అశోక్ రెడ్డి హాజరు కాలేక తన తనయుడు ముత్తుముల దివ్యేష్ రెడ్డిని కసినేపల్లి గ్రామానికి పంపించారు. దీనితో ఎమ్మెల్యే తనయుడు దివ్యేష్ రెడ్డి బుధవారం కసినేపల్లి గ్రామానికి చేరుకొని నూతన ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆ సందర్భంగా ఆలయ అర్చకులు దివ్యేష్ రెడ్డి కి పూర్ణకుంభంతో స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం బండలాగుడు పందెం పోటీల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని బండలాగుడు పందెం పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఆ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు, కసినేపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

# గ్రామ దేవతల ఆశీస్సులే గ్రామాలకు శ్రీరామరక్ష





**కొమరోలు, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 6**

గ్రామదేవతల ఆశీస్సులు, దీవెనలే గ్రామాలకు శ్రీరామరక్ష అని కొమరోలు జడ్పిటిసి సభ్యులు సారే వెంకట నాయుడు పేర్కొన్నారు. కొమరోలు మండలం చింతలపల్లి పంచాయతీలోని కసినేపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ దేవతల ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఈనెల 4వ తేదీ నుంచి ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా ఆరవ తేదీ బుధవారం ఆ గ్రామంలోని నూతన ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాలకు వెంకట నాయుడు హాజరై పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఆ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు వెంకట నాయుడు కు ఘన స్వాగతం పలికారు. ఆ సందర్భంగా వెంకట నాయుడు మాట్లాడుతూ గ్రామదేవతల ను ఆరాధించటం ,పూజా కార్యక్రమాలు ,వేడుకలు, వార్షికోత్సవాలు నూతన ఆలయాల నిర్మాణాలు ధ్వజా విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహించడం అనాదిగా వస్తున్న సాంప్రదాయమని, అదే సాంప్రదాయాన్ని నేటికి కూడా కొనసాగిస్తూ నిర్వహించడం అభినందనీయమని అన్నారు.సాయంత్రం రాష్ట్రస్థాయి బండలాగుడు పందెం పోటీలు నిర్వహించారు. సదరు పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జడ్పిటిసి వెంకటనాయుడు బండలాగుడు పందెం పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఆ కార్యక్రమంలో చింతలపల్లి మాజీ సర్పంచ్ సారే జనార్ధన్ నాయుడు, పుల్లారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ వైజా నారాయణరెడ్డి,పలువురు వైసిపి నేతలు కార్యకర్తలు కసినేపల్లి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# 13న గిద్దలూరు ఎ.ఎం.సి ప్రాంగణంలో పశువుల సంత ప్రారంభం

**గిద్దలూరు, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 6**



రైతులు, పశు పోషకుల శ్రేయస్సును, సంక్షేమం దృష్టిలో పెట్టుకుని గిద్దలూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో ఈ నెల 13వ తేదీ బుధవారం గొర్రెల సంతను ప్రారంభిస్తున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బైలడుగు బాలయ్య, కార్యదర్శి కె.రామకృష్ణ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి చేతుల మీదుగా సంత ప్రారంభించబడును. ప్రతీ శుక్రవారంనాడు జరిగే పశువుల సంత ద్వారా పశుపోషకులు, వ్యాపారులు క్రయ విక్రయాలు చేసుకోవచ్చన్నారు.

# ఇండిపెండెన్స్ డే వీకెండ్లో చిరు?




నల్ల చీరలో దాన్ని చంపేసిన హాట్ హీరోయిన్!



అద్భుతమైన గ్లామ్ ప్రెజెన్స్‌తో బోల్డ్ రెడ్ లుక్‌లో అషు రెడ్డి అబ్బురపరిచింది

మెగాస్టార్ చిరంజీవి ఎప్పుడో మూడేళ్ల ముందు మొదలుపెట్టిన సినిమా 'విశ్వంభర'. కానీ ఇప్పటిదాకా విడుదలకు నోచుకోలేదు. ఈ సినిమా మొదలైనపుడు అంచనాలు మామూలుగా లేవు. చిరు కెరీర్లోనే అత్యధిక బడ్జెట్లో తెరకెక్కుతున్న సినిమా.. 'బింబిసార' లాంటి బ్లాక్ బస్టర్ ఇచ్చిన దర్శకుడు.. యువి క్రియేషన్స్ లాంటి పెద్ద బేనర్.. 'జగదేక వీరుడు అతిలోక సుందరి' సినిమాను గుర్తు చేసే ఫాంటసీ జానర్.. ఇలా సినిమా మొదలైనపుడు ప్రతి విషయం ఎంతో క్యూరియాసిటీ పెంచాయి.



కానీ ఈ సినిమా టీజర్ లాంచ్ అయ్యాక మొత్తం మారిపోయింది. అందులో విజువల్స్ అంచనాలకు తగ్గట్లు లేకపోవడంతో సోషల్ మీడియాలో విపరీతమైన ట్రోలింగ్ జరిగింది. దీంతో టీం ఆత్మరక్షణలో పడిపోయింది.అదే ఔట్‌పుట్‌తో సినిమాను రిలీజ్ చేస్తే చాలా కష్టమని.. విజువల్ ఎఫెక్ట్స్ కంటెంట్ అంతా మార్చేయాలని టీం నిర్ణయించింది. దీంతో సినిమా నిరవధికంగా వాయిదా పడింది. గత సంక్రాంతికి అనుకున్న సినిమా కాస్తా.. రెండోసారి ప్రకటించినట్లు ఈ వేసవికి కూడా విడుదల కావట్లేదు. చివరగా జులై 10 డేట్ తెరపైకి వచ్చింది. ఆ రోజు సినిమా రిలీజ్ ఖాయమని, అధికారిక ప్రకటన కూడా చేయబోతున్నారని వార్తలు వచ్చాయి. కానీ తాజా సమాచారం ప్రకారం ఆ రోజు కూడా సినిమా రిలీజ్ కాదని అర్థమైపోయింది. చిరు తనయుడు రామ్ చరణ్ కొత్త సినిమా 'పెద్ది' జూన్ 25కు ఖరారవడంతో 'విశ్వంభర'ను వాయిదా వేయక తప్పట్లేదు.చరణ్ సినిమా వచ్చిన రెండు వారాలకే చిరు సినిమాను రిలీజ్ చేసే పరిస్థితి లేకపోవడమే అందుక్కారణం. లేటెస్ట్ ఇన్ఫర్మేషన్ ప్రకారం 'విశ్వంభర' కోసం ఇండిపెండెన్స్ డే వీకెండ్‌ను పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఆ టైంలో లాంగ్ వీకెండ్ కలిసొస్తుంది. సినిమా బాగుంటే వసూళ్ల మోత మోగుతుంది. అందుకే ఆ వీకెండ్‌ను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా షూటింగ్ ఎప్పుడో పూర్తి కాగా.. పోస్ట్ ప్రొడక్షన్ సుదీర్ఘ కాలంగా జరుగుతోంది. అది కూడా ఒక కొలిక్కి వచ్చినట్లే భావిస్తున్నారు. ఆగస్టు 13 లేదా 14 తేదీల్లో ఒక డేట్ ఎంచుకుని త్వరలోనే అధికారిక ప్రకటన చేస్తారని.. ఇది ఫైనల్ అని.. కచ్చితంగా ఆ డేటుకు సినిమాను రిలీజ్ చేయాలనుకుంటున్నారని సమాచారం.

# సంజు శాంసన్ కొడితే.. గెలిచినట్లే!

**6, 7, 9, 7, 11.. చెన్నై సూపర్ కింగ్స్‌కు ఓటమి**

**115, 48, 101, 87 నాటౌట్.. చెన్నై సూపర్ కింగ్స్‌కు అద్భుత విజయాలు**



పైన పేర్కొన్న గణాంకాలు సంజు శాంసన్‌వి. అతడు నిలబడి కొడితే సీఎస్‌కేకు విజయం ఖాయమనే భరోసా అభిమానుల్లో కల్పించాడు. మూడుసార్లు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను సొంతం చేసుకున్నాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో చెన్నై 10 మ్యాచులు ఆడింది. ఐదు విజయాలు నమోదు చేసింది. మరో ఐదింట్లో ఓడిపోయింది. ఆ గెలిచిన ఐదు మ్యాచుల్లో సంజు శాంసన్ ప్రభావం ఏపాటిదో అతడి స్కోర్లను చూస్తేనే అర్థమవుతోంది. తొలుత ప్లేఆఫ్స్ రేసులో చాలా వెనుకబడిన సీఎస్‌కే.. ఇప్పుడు ముందుకు దూసుకురావడంలో సంజుదే కీలక పాత్ర. మరోవైపు కెప్టెన్ రుతురాజ్ అప్పుడప్పుడు మెరుస్తున్నా.. నిలకడ కొరవడింది. కానీ, మొదట్లో ఇబ్బందిపడిన సంజు మాత్రం నిలదొక్కుకున్నాక వెనక్కి తిరిగిచూడలేదు. ఇప్పటికే రెండు సెంచరీలు చేసిన సంజు.. మూడోది చేసే అవకాశం వచ్చినా జట్టు కోసం కాస్త వెనక్కి తగ్గాడు. తాజాగా దిల్లీపై విజయం అనంతరం అతడు చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం. క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్‌నూ మెప్పించడం గమనార్హం.

**'సంజు' అని..:** ఈ సీజన్‌లో దిల్లీపై సీఎస్‌కే రెండు మ్యాచుల్లోనూ గెలిచింది. సంజు శాంసన్ సెంచరీ, హాఫ్ సెంచరీ చేసి సత్తా చాటాడు. ఇక్కడ మరో శతకం చేసే అవకాశం వచ్చింది. అయితే, మరో ఎండ్‌లో కార్తిక్ శర్మ దూకుడుగా ఆడేశాడు. దీంతో 87 పరుగులతో సంజు అజేయంగా నిలిచాడు. ఈ సందర్భంగా వ్యాఖ్యాత అడిగిన ప్రశ్నకు ఇచ్చిన సమాధానం ఆకట్టుకుంది. శతకం చేయడం స్పెషలే అయినా.. అందుకోసం తాను స్వార్థపరుడిగా మారాల్సి వచ్చేదని బదులిచ్చాడు. దీనిపై క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ ప్రశంసల వర్షం కురిపించాడు. అందరూ 'అన్న (చేట)' అని పిలుస్తుంటారు కదా.. ఆ పిలుపు ఎలా ఉంటుందనే ప్రశ్నకు బదులిచ్చాడు. తనకు చేట అని కాకుండా.. 'సంజు'గా పిలుపించుకోవడమే ఇష్టమని వినమ్రంగా సమాధానం ఇచ్చాడు.

**ఎక్కడా తొందరపడకుండా..:** తొలి మూడు మ్యాచుల్లో సంజు శాంసన్ కేవలం సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యాడు. దీంతో అతడిపై తీవ్ర విమర్శలు వచ్చాయి. భారీ మొత్తం వెచ్చించినా సరైన ప్రతిఫలం ఇవ్వడం లేదని విమర్శించారు. కానీ, గత టీ20 ప్రపంచ కప్‌లోనూ సంజు నుంచి ఇలాంటి 'స్లో స్టార్ట్'ను చూశాం. ఆ తర్వాత చెలరేగిపోయి 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ'గా నిలిచాడు. ఇప్పుడు కూడా సేమ్ ఫార్ములా. భారీ ప్రైస్ ట్యాగ్‌తోపాటు ధోని వారసుడంటూ వచ్చిన ఒత్తిడిని అధిగమించాడు. ఇంతకుముందు వచ్చీ రాగానే భారీ షాట్లకు పోయి వికెట్ సమర్పించేవాడు. ఇప్పుడు అలా కాదు.. పరిస్థితిని బట్టి ఆడటం మొదలుపెట్టాడు. ఓ సందర్భంలో 'గేమ్ ఎలా ఆడాలో పరిస్థితులే నేర్పిస్తాయి' అని సంజు అన్న మాటలు గుర్తున్నాయి కదా. ఐపీఎల్‌లో సీఎస్‌కే తరఫున ఇప్పటివరకూ ఎవరూ రెండు సెంచరీలు చేయలేదు. కానీ, సంజు ఆ ఘనతను సాధించాడు. క్రీజ్‌లో తాను ఉండటం ఎంత ముఖ్యమో తెలుసుకున్నాడు. ఒక్కసారి కుదురుకున్నాక బ్యాట్‌ను ఝుళిపించేశాడు. మైదానంలో ప్రత్యర్థి ఆటగాళ్లపై ఇప్పటివరకు దురుసుగా వ్యవహరించిన దాఖలాలూ లేవు. మైదానంలోనే కాదు.. డగౌట్‌లోనూ ప్రశాంతంగానే ఉంటాడు.

**ఆ నాలుగు మ్యాచుల్లోనూ..:** ప్రస్తుత సీజన్‌లో సీఎస్‌కే మరో నాలుగు మ్యాచులు ఆడాల్సిఉంది. ప్రస్తుతం 10 పాయింట్లతో పట్టికలో ఆరో స్థానంలో నిలిచింది. ప్లేఆఫ్స్‌కు చేరుకోవాలంటే కచ్చితంగా మూడు మ్యాచుల్లో విజయం సాధించాలి. అన్నీ గెలిస్తే మాత్రం నాకౌట్ బెర్తు ఖాయమయ్యే అవకాశాలు ఎక్కువ. ఇలా జరగాలంటే సంజుశాంసన్ ఇదే ఆటతీరు ప్రదర్శించాలి. ఎంఎస్ ధోని ఈ సీజన్‌లో కనీసం ఒక్క మ్యాచ్‌లోనైనా ఆడతాడా? అంటే చెప్పలేని పరిస్థితి. కాబట్టే సంజు పైనే సీఎస్‌కే భారం.

# ఐపీఎల్ 2026.. మూడు వేదికల్లో ప్లేఆఫ్స్.. ఈసారి ఫైనల్ అక్కడే?

ఐపీఎల్ 2026 సీజన్‌కు సంబంధించి ప్లేఆఫ్స్ మ్యాచుల వేదికలను బీసీసీఐ ఖరారు చేసింది. అలాగే ఫైనల్‌కు బెంగళూరు కాకుండా.. అహ్మదాబాద్‌ను వేదికగా చేస్తూ ప్రకటనను విడుదల చేసింది. ఈసారి దక్షిణ భారతంలో ఒక్క నాకౌట్ మ్యాచ్ నిర్వహణకు కూడా అవకాశం లేకుండా పోయింది. ప్లేఆఫ్స్ మ్యాచులకు రెండు వేదికలను మాత్రమే కేటాయించింది. మే 24తో లీగ్ స్టేజ్‌లు ముగుస్తాయి. ఆ తర్వాత రెండు రోజుల అనంతరం నాకౌట్ మ్యాచులు మొదలవుతాయి. "ఫైనల్ మ్యాచ్‌కు బెంగళూరును తొలుత నిర్ణయించారు. అయితే, మా నిర్దేశిత మార్గదర్శకాలు, నిబంధనల పరిధికి లోబడేలా లోకల్ అసోసియేషన్, అధికారుల రిక్వైర్‌మెంట్స్ లేకపోవడంతో వేదికను మార్చడం జరిగింది" అని బీసీసీఐ పేర్కొంది. పాయింట్ల పట్టికలో టాప్-4లో ఉన్న జట్లు ప్లేఆఫ్స్‌లో తలపడతాయి. తొలి రెండు స్థానాల్లో జట్లు మొదటి క్వాలిఫయర్స్ ఆడతాయి. అందులో గెలిచిన జట్టు ఫైనల్‌కు చేరుకుంటుంది. ఓడిన టీమ్‌కు మరో అవకాశం ఉంది. మూడు, నాలుగు స్థానాల్లో ఉండే జట్లు ఎలిమినేటర్‌లో తలపడతాయి. అందులో గెలిచిన జట్టు రెండో క్వాలిఫయర్‌కు అర్హత సాధిస్తుంది. క్వాలిఫయర్ -1లో ఓడిన జట్టుతో ఎలిమినేటర్ విజేత ఢీకొడుతోంది. ఇందులో గెలిచిన జట్టు ఫైనల్‌కు చేరుకుంటుంది. అక్కడ ఎవరైతే విజయం సాధిస్తారో ఐపీఎల్ కప్పు వారి సొంతమవుతుంది.



**ఇదీ షెడ్యూల్**

క్వాలిఫయర్ -1 : ధర్మశాల వేదికగా మే 26న

ఎలిమినేటర్: చండీగఢ్ వేదికగా మే 27న

క్వాలిఫయర్ -2 : చండీగఢ్ వేదికగా మే 29న

ఫైనల్ మ్యాచ్: అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా మే 31న

# ఎవరు 'టాప్' లేపుతారో? పంజాబ్‌తో సన్‌రైజర్స్ అమీతుమీ



ఐపీఎల్ 2026లో మరో ఆసక్తికర పోరుకు వేళైంది. పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉన్న పంజాబ్ కింగ్స్.. మూడో స్థానంలో ఉన్న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. వరుసగా రెండు ఓటములు చవిచూసిన పంజాబ్.. ఈ మ్యాచ్‌తో మళ్లీ గెలుపుబాట పట్టాలని చూస్తోంది. వరుసగా ఐదు విజయాలతో జోరు మీద కనిపించిన సన్‌రైజర్స్‌కు గత మ్యాచ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ షాక్ ఇచ్చింది. ఆ వైఫల్యాన్ని అధిగమించి పంజాబ్‌ను దెబ్బకొట్టి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలోకి దూసుకెళ్లాలని ఆరెంజ్ ఆర్మీ పట్టుదలతో ఉంది. ఈ రెండు జట్లకు టాప్ ఆర్డరే ప్రధాన బలం. ముఖ్యంగా ఓపెనర్లపైనే పంజాబ్, సన్‌రైజర్స్ ఎక్కువగా ఆధారపడుతున్నాయి. ఈ మ్యాచ్‌లోనూ ఏ జట్టు ఓపెనర్లు చెలరేగితే ఆ టీమ్‌కే విజయావకాశాలు ఎక్కువ. సన్‌రైజర్స్ హెడ్ కోచ్ వెటోరి కూడా ఇదే విషయం చెప్పాడు. రెండు జట్ల బ్యాటింగ్ ఆర్డర్‌కు ఓపెనర్లే కీలకమని పేర్కొన్నాడు. మ్యాచ్‌లో ఎవరు రాణిస్తే వారినే విజయం వరిస్తుందన్నాడు. గత మ్యాచ్‌లో నిరాశపరిచిన అభిషేక్ శర్మ పంజాబ్‌పై చెలరేగిపోవాలని అభిమానులు ఆశిస్తున్నారు. ఫామ్‌లోకి వచ్చిన ట్రావిస్ హెడ్ నుంచి కూడా మరోసారి భారీ ఇన్నింగ్స్ ఆశిస్తున్నారు. 'ట్రావిషేక్' విధ్వంసం సృష్టిస్తే సగం మ్యాచ్ గెలిచినట్లే. హెన్రిచ్ క్లాసెన్, ఇషాన్ కిషన్ కూడా బ్యాట్ ఝుళిపిస్తే ఆరెంజ్ ఆర్మీ 'టాప్' లేపడం ఖాయం. పంజాబ్ ఓపెనర్లు ప్రియాంశ్ ఆర్య, ప్రభ్‌సిమ్రన్ సింగ్‌లను వీలైనంత తొందరగా పెవిలియన్‌కు పంపడంపై హైదరాబాద్ విజయావకాశాలు ఆధారపడి ఉంటాయి. గత రెండు మ్యాచ్‌ల్లో ప్రియాంశ్ ఆర్య 29, 2 పరుగులకు వెనుదిరిగాడు. ప్రభ్‌సిమ్రన్ 59, 15 రన్స్ చేశాడు. గుజరాత్ బౌలర్ల దెబ్బకు గత మ్యాచ్‌లో పంజాబ్ టాప్ ఆర్డర్ ఒక్కరూ కూడా 20కిపైగా రన్స్ చేయలేదు. ఆరెంజ్ ఆర్మీ కూడా పంజాబ్ 'టాప్' బ్యాటర్లను టార్గెట్ చేస్తే విజయం సాధించడం ఖాయం. కేకేఆర్‌తో మ్యాచ్‌లో భారీగా పరుగులు సమర్పించుకున్న కమిన్స్, ఎషాన్ మలింగ ఈ మ్యాచ్‌లో ఏ మేరకు పుంజుకుంటారో చూడాలి. సకిబ్ హుస్సేన్, శివాంగ్‌కుమార్ చక్కటి బౌలింగ్‌తో పరుగులు కట్టడి చేస్తున్నారు. ఇరుజట్ల మధ్య ఇప్పటివరకు 25 మ్యాచ్‌లు జరగ్గా హైదరాబాద్‌దే పైచేయి. 17 మ్యాచ్‌ల్లో సన్‌రైజర్స్ గెలవగా.. పంజాబ్ ఎనిమిదింటిలో నెగ్గింది. ఉప్పల్‌లో పంజాబ్ కింగ్స్ ఒకే ఒక్క మ్యాచ్ (2014)లో విజయం సాధించింది.

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776